teenmaardesk@gmail.com

RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

## హైదరాబాద్ నగరంలో రికార్డు స్థాయిలో డూప్లికేట్ ఓట్లు

గుర్తించిన ఎన్నికల సంఘం

లోక్‌సభ ఎన్నికల వేళ డూప్లికేట్ ఓట్లపై ఈసీ ఫోకస్

2



ములుగు | సంపుటి : 02 | సంచిక : 347 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శనివారం | 20 ఏప్రిల్ 2024 | పేజీలు : 08 | వెల ' 5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.



## ఢిల్లీ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురుతుంది

**రాహుల్గాంధీ ప్రధానిగా ప్రమాణస్వీకారం చేయడం ఖాయం**

**ధీమా వ్యక్తం చేస్తూ రేవంత్ రెడ్డి వాఖ్యలు**

ఢిల్లీ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురుతుందని, రాహుల్గాంధీ ప్రధానిగా ప్రమాణస్వీకారం చేయడం ఖాయమని రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని రక్షించడానికి లోక్సభ ఎన్నికల్లో విజయం సాధించడం చాలా అవసరమన్నారు.

తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 19 (తీన్మార్ న్యూస్): శుక్రవారం సాయంత్రం మహబూబాబాద్లో నిర్వహించిన కాంగ్రెస్ జనజాతర సభలో రేవంత్ ప్రసంగించారు. విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి ప్రకటించిన హామీలను బీజేపీ సర్కారు నెరవేర్చలేదన్నారు. బయ్యారం

మిగతా 2 లో




## కేజ్రీవాల్‌ను జైల్లో చంపే కుట్ర జరుగుతోంది

**అభ్యర్థనలు చేసినప్పటికీ ఇన్సులిన్ ఇవ్వడం లేదు**

**తీవ్ర ఆరోపణలు చేస్తున్న ఆ రాష్ట్ర మంత్రి అతిషి**

.. వివరాలు 2లో




## రాష్ట్ర కాంగ్రెస్‌లో నడుస్తుంది "అంతా" బీజేపీ కథే

### కాంగ్రెస్‌లో పరిస్థితులు గందరగోళం

**కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చీల్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తుంది**

**ఏడాదిలోపు అసెంబ్లీ రద్దయినా ఆశ్చర్యం అవసరం లేదు**

**బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు వ్యాఖ్యలు**



బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన నాయకులు బాధపడుతున్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉందంటూ ఆ పార్టీలోకి వెళితే.. అక్కడంతా బీజేపీ కథ నడుస్తోందని ఓ నాయకుడు నాతో వాపోయారు. 20 మంది ఎమ్మెల్యేలను తీసుకుని రావాలా అని నన్ను సంప్రదించారు. కానీ ఇప్పుడు వద్దని వారించాను.

తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 19 (తీన్మార్ న్యూస్): తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అసమర్థతతో కాంగ్రెస్‌లో గందరగోళ పరిస్థితులు ఉన్నాయని లోక్‌సభ ఎన్నికల తర్వాత ఏడాదిలోపు అసెంబ్లీ రద్దయినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు

మిగతా 2 లో



## ఈ నెల 22 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా కేసీఆర్ బస్సు యాత్రలు

యాత్ర పర్మిషన్‌పై ఎన్నికల ప్రధానాధికారిని కలిసిన బీఆర్ఎస్ నాయకులు

.. వివరాలు 2లో



## కేసీఆర్‌కు పీసీసీ చీఫ్, సీఎం రేవంత్ స్ట్రాంగ్ వార్నింగ్

కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై చేయి వేస్తే మాడి మసై పోతారని వాఖ్యలు

కేసీఆర్ తో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారన్న కామెంట్‌పై స్పందించిన సిఎం

.. వివరాలు 2లో

## గత ప్రభుత్వం రైతుబంధుకు దాచిన 7 వేల కోట్లు ఏమయ్యాయ్



**బీఆర్ఎస్‌పై మండిపడ్డ డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క**

హైదరాబాద్, ఏప్రిల్ 19 (తీన్మార్ న్యూస్): గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు కోసం దాచిన 7 వేల కోట్ల రూపాయలు ఏమయ్యాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రశ్నించారు. బషీర్‌బాగ్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మీట్ ది ప్రెస్ కార్యక్రమం నిర్వహించిన భట్టి బీఆర్ఎస్‌పై మండిపడ్డారు. తాము ప్రభుత్వం ఏర్పాటుకు ముందే ఆర్బీఐ స్టేట్‌మెంట్ తీసుకున్నట్టు తెలిపారు. అందులో మైనస్ 3 వేల 200 కోట్లు ఉందని.. మరి బీఆర్ఎస్ ప్రభుత్వం చెప్పిన 7 వేల కోట్లు ఎవరి జేబులోకి.. ఏ వ్యక్తి అకౌంట్లోకి వెళ్లాయని భట్టి ప్రశ్నించారు.

## కడియం శ్రీహరిపై నిప్పులు చెరిగిన తాటికొండ రాజయ్య



**కడియంని భూస్థాపితం చేసే వరకు వదిలే ప్రసక్తే లేదు**

**పదవికి రాజీనామా చేసి తనతో పోటీకి దిగాలని సవాల్**

వరంగల్, ఏప్రిల్ 19 (తీన్మార్ న్యూస్): ఓరుగల్లులో నేతల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. అవి పక్కదేశం పాకిస్థాన్ వైపు దూసుకెళ్తున్నాయి. స్టేషన్ ఘన్పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య

మిగతా 2 లో



# ఈ నెల 22 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా కేసీఆర్ బస్సు యాత్రలు

హైదరాబాద్, ఏప్రిల్ 19 (తీన్మార్ న్యూస్): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ బస్సు యాత్ర చేపట్టాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నెల 22 నుంచి మే 10వ తేదీ వరకు తెలంగాణ వ్యాప్తంగా కేసీఆర్ బస్సు యాత్ర చేపట్టనున్నారు. ఈ క్రమంలో కేసీఆర్ బస్సు యాత్ర పర్మిషన్‌పై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్ రాజ్‌ను బీఆర్ఎస్ నాయకులు కే వాసుదేవా రెడ్డి శుక్రవారం కలిశారు. ఈ మేరకు బస్సు యాత్ర వివరాలను వికాస్ రాజ్‌కు వాసుదేవా రెడ్డి అందజేశారు. ఈ నేపథ్యంలో యాత్రకు సంబంధించి భద్రతా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. యాత్రకు పోలీసుల సహకారం అందించేలా చూడాలని కోరారు. ఎన్నికలు పారదర్శకంగా, ప్రశాంతంగా జరిగేలా చూడాలని వాసుదేవా రెడ్డి కోరారు. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 3-4 అసెంబ్లీ నియోజకవర్గాల్లో రోడ్ షోలుంటాయని, పార్టీకి అనుకూలంగా ఉండే రూట్‌మ్యాప్‌ను, ప్రదేశాలను నాయకులే కూర్చొని నిర్ణయించాలని నిన్న జరిగిన బీఆర్ఎస్ మీటింగ్‌లో కేసీఆర్ సూచించారు. రోడ్‌షోలు ఉదయం 8 నుంచి 10 గంటల మధ్య ఉంటాయని, తిరిగి సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఉంటాయని తెలిపారు. బస్సుయాత్రలు చేస్తూనే మధ్యలో బహిరంగ సభల్లో కూడా పాల్గొంటానని చెప్పారు. సిద్దిపేట, వరంగల్ సహా మరికొన్ని ప్రాంతాల్లో కూడా కొన్ని బహిరంగ సభలు ఉంటాయన్నారు. కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేయాలని కోరారు.

# కేసీఆర్‌కు పీసీసీ చీఫ్, సీఎం రేవంత్ స్ట్రాంగ్ వార్నింగ్

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 19 (తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై చేయి వేస్తే మాడి మసై పోతారని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు పీసీసీ చీఫ్, సీఎం రేవంత్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఇటీవల కేసీఆర్ మాట్లాడుతూ, తమతో 20 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని చేసిన కామెంట్‌పై స్పందించారు. ఇక్కడ కాపలా ఉన్నది తానేనని. తమ ఎమ్మెల్యేలను ముట్టుకుంటే మాడి మసైపోతారని హెచ్చరించారు. మహబూబ్‌నగర్ అభ్యర్థి చల్లా వంశీ చంద్ రెడ్డి నామినేషన్ ర్యాలీ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. రాష్ట్రం వచ్చాక పాలమూరుకు కేసీఆర్ చేసింది ఏమిటని ప్రశ్నించారు. పాలమూరుకు కాంగ్రెస్ ప్రభుత్వం వర్సిటీ ఇస్తే.. కేసీఆర్ నిర్మించారా.. అని నిలదీశారు. ఏం చేశారని పాలమూరు ప్రజలు బీఆర్ఎస్‌కు ఓటేయాలన్నారు. పార్లమెంట్‌లో నిద్రపోవడానికి బీఆర్ఎస్‌కు ఓటు వేయాలా అన్నారు. కారు రిపేర్‌కు వెళ్లిందని కేటీఆర్ అన్నారని.. 2009లో కేసీఆర్‌ను కరీంనగర్ ప్రజలు తరిమికొట్టారన్నారు. కారు షెడ్డు నుంచి బయటకు రాదని, అది పూర్తిగా పాడైపోయిందన్నాని వ్యాఖ్యానించారు.

# కడియం శ్రీహరిపై నిప్పులు చెరిగిన తాటికొండ రాజయ్య

మొదటి పేజీ తరువాయి

మరోసారి శివమెత్తారు. తన చిరకాల రాజకీయ ప్రత్యర్థి కడియం శ్రీహరి పై నిప్పులు చెరిగారు. మీసం మెలేసి తొడగొట్టిన రాజయ్య కడియం శ్రీహరిని భూస్థాపితం చేసే వరకు వదిలే ప్రసక్తే లేదన్నారు. దమ్ముంటే తన పదవికి రాజీనామా చేసి తనతో పోటీకి దిగాలని సవాల్ విసిరారు. ఒకవైపు మాటల తూటాలు మరోవైపు తనదైన శైలిలో స్టెప్పులేసి గులాబీ శ్రేణుల్లో జోష్ నింపారు. హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ రాజయ్య, దాస్యం వినయ్ భాస్కర్, చల్లా ధర్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈల కొట్టి స్టెప్పులేసిన రాజయ్య కేసీఆర్ పాటకు తనదైన శైలిలో డ్యాన్స్ చేసి, బీఆర్ఎస్ కార్యకర్తల్లో జోష్ నింపారు. రాజయ్యతో పాటు, అక్కడే ఉన్న నేతలు సైతం స్టెప్పులు వేశారు. బీఆర్ఎస్ పార్టీలోకి రీ-ఎంట్రీ ఇచ్చిన తర్వాత ఫుల్ జోష్‌లో ఉన్న తాటికొండ రాజయ్య ఇప్పుడు ఆ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో స్టార్ క్యాంపెనర్‌గా మారారు. తన చిరకాల రాజకీయ ప్రత్యర్థి కడియం శ్రీహరిపై రాజయ్య రంకెలేస్తున్నారు. ఈ మేరకు తొడగొట్టి సవాల్ విసిరిన మాజీ ఎమ్మెల్యే నమ్మకద్రోహం చేసిన కడియం అంతుచూస్తా, నిన్ను భూ స్థాపితం చేయడమే నా లక్ష్యం అని అన్నారు. కడియంకు నిజాయితీ ఉంటే రాజీనామా చేసి రా చూసుకుందాం అని మీసం మెలేసి సవాల్ విసిరారు. తెలుగు రాష్ట్రాల్లో అంతా మన ఇద్దరి కోసమే ఎదురు చూస్తున్నారు. దమ్ముంటే రా అని సవాల్ విసిరారు. నాకు నేనుగా రాజకీయ ఆత్మహత్య చేసుకునేలా చేసిన దుర్మార్గుడు కడియం నిన్ను వదిలే ప్రసక్తే లేదు. రేవంత్ రెడ్డి అభయహస్తం అంటున్నాడు.. కానీ కడియం శ్రీహరి లాంటి భస్మాసురుడు పక్కన చేరాడు జాగ్రత్త. నాకున్న పని కేవలం నున్ని తొక్కడే. దళిత ద్రోహి, కల్నాయక్, నమ్మకద్రోహి, డిక్టేటర్, గుంటనక్క కడియం శ్రీహరి అంటూ నిప్పులు చెరిగారు. రాజయ్య మాటల తూటాలు పక్క దేశం పాకిస్థాన్ వరకు వెళ్తున్నాయి. కడియం శ్రీహరిని ఇక్కడ తొక్కితే పాకిస్తాన్‌లో తేలాలని ధ్వజమెత్తారు. తెలుగు రాష్ట్రాలు మన గురించి చూస్తున్నాయని, ఇద్దరం పోటీచేసి చేసి తేల్చుకుందాం రా అని సవాల్ విసిరారు.

# ఎంపీ అభ్యర్థి రఘు నందన్ రావు కీలక వ్యాఖ్యలు

### కేసీఆర్ ను కాళేశ్వర రావు అంటారు.. నంగునూర్ చెరువులో నీళ్లే లేవు

### హరీష్ రావు గట్టు మీద నిల్చున్నారు.. ఏ గట్టుకస్తాడో

సిద్దిపేట, ఏప్రిల్ 19 (తీన్మార్ న్యూస్): మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్‌పై మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘు నందన్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. 1985లో కేసీఆర్ మొదటిసారిగా సిద్దిపేట ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి 39 ఏండ్లుగా సిద్దిపేటలో కుటుంబ పాలన సాగుతోందని విమర్శించారు. శుక్రవారం నంగునూర్ మండలం కోనాయిపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన అనంతరం ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేసీఆర్ అంటే కాళేశ్వర రావు అంటారు కానీ నంగునూర్‌లోని ఒక్క చెరువులో నీళు ్ళ లేవని విమర్శించారు. ఎన్నికలు కవితను తీహార్ జైలు నుంచి బయటకు తెచ్చే ఎన్నికలు కావన్నారు. రఘునందన్‌రావు దుబ్బాకలో ఓడిపోవడం ఎంత నిజమో కామారెడ్డిలో కేసీఆర్‌ను బీజేపీ వాళ్లు ఓడించింది అంతే నిజమన్నారు. తెలంగాణలో ఆడపిల్లలు లిక్కర్ దందా నడపరన్నారు. మరికొద్ది రోజుల్లో కేసీఆర్ ఇంట్లో వాళ్ళు జైలుకు వెళ్లక తప్పదంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. రూ.1600 కోట్లతో సిద్దిపేట నుంచి ఎలకతుర్తి వరకు కేంద్ర నిధులతో రోడ్ పనులు నడుస్తున్నాయన్నారు. ఇంకా ఐదేండ్లు ఉచిత రేషన్ బియ్యం అందిస్తామన్నారు. రేవంత్ రెడ్డి గెలిచి నాలుగు నెలలు అయినా రూ.4 వేల పింఛన్ ఇవ్వలేదన్నారు. రేవంత్ రెడ్డి లంకె బిందెలు ఉన్నాయని అధికారంలోకి వచ్చాడా.. లేదా ఖాళీ బిందెలు ఉన్నాయని అధికారంలోకి వచ్చాడా అని వ్యాఖ్యలు చేశారు. మోదీ రైతులకు సబ్సిడీతో ఎరువుల బస్తాలు అందించారన్నారు. హరీష్ రావు గట్టు మీద నిల్చున్నారని.. కాంగ్రెస్‌లోకి పోతారా.. అందులోనే ఉంటారా అనేది తెల్వదంటూ కామెంట్స్ చేశారు. ఈ దేశం బాగుండాలి అంటే బీజేపీ గెలవాలన్నారు. రాష్ట్రంలో ఒక్క ముదిరాజ్ ఎమ్మెల్యే గెలిస్తే ఎందుకు మంత్రి పదవి ఇవ్వలేదన్నారు. రేవంత్ రెడ్డి డిసెంబర్ 9 న రెండు లక్షల రుణమాఫీ చేస్తానని నేటికీ రుణమాఫీ చేయలేదని విమర్శించారు. దేశంలోని ఇస్లామిక్ తీవ్రవాదం పోవాలి అంటే హిందూ మత రక్షణ జరగాలి అంటే నరేంద్ర మోదీ గెలవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ కులం పేరుతో చేస్తున్న రాజకీయాలను తిప్పి కొట్టాలని రఘునందన్ రావు పిలుపునిచ్చారు.

# గురుకుల హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్ పై కేంద్రం సీరియస్

### ఘటనపై దర్యాప్తుకు ఈ నెల 22న నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ కాస్ట్స్ బృందం

తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 19 (తీన్మార్ న్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ఎస్సీ గురుకుల పాఠశాల హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్ ఘటనపై కేంద్రం సీరియస్ అయ్యింది. ఈ ఘటనపై దర్యాప్తు చేసేందుకు ఈ నెల 22న భువనగిరిలోని గురుకులాన్ని నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ కాస్ట్స్ బృందం సందర్శించనుంది. అలాగే ఫుడ్‌పాయిజన్‌కు గురైన బాధిత విద్యార్థులతో పాటు ఈ ఘటనలో మరణించిన ప్రశాంత్ కుటుంబ సభ్యులను కలవనుంది. అనంతరం ఈ ఘటనపై కేంద్రానికి నివేదిక అందించనుంది. భువనగిరి గురుకుల హాస్టల్‌లోని విద్యార్థులకు గత శుక్రవారం రాత్రి మజ్జిగతో పాటు కిచిడీ అందించారు. అయితే వాటిని తిన్న తర్వాత 27 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, విరేచనాలతో బాధపడ్డారు. దీంతో అప్రమత్తమైన హాస్టల్ సిబ్బంది అస్వస్థతకు గురైన విద్యార్థులను ఆస్పత్రికి తరలించారు. వీరిలో ప్రశాంత్ అనే విద్యార్థి పరిస్థితి అత్యంత విషమంగా ఉండటంతో హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని రెయిన్‌బో ఆస్పత్రికి తరలించారు. అక్కడే వెంటిలేటర్‌పై చికిత్స పొందిన ప్రశాంత్ మంగళవారం సాయంత్రం కన్నుమూశాడు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది.

# రాష్ట్ర కాంగ్రెస్‌లో నడుస్తుంది "అంతా" బీజేపీ కథే

మొదటి పేజీ తరువాయి



వ్యాఖ్యానించారు. రాష్ట్ర కాంగ్రెస్‌లో అంతా బీజేపీ కథ నడుస్తోందని.. రేవంత్ బీజేపీలోకి వెళ్లినా ఆయన వెంట వెళ్లేందుకు కరుడుగట్టిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సిద్ధంగా లేరని పేర్కొన్నారు. సుమారు 20 నుంచి 30 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తనతో టచ్‌లో ఉన్నారన్నారు. గురువారం బీఆర్ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లో జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో కేసీఆర్ మాట్లాడారు. పార్టీ నేతలు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. గతంలో బీఆర్ఎస్‌కు 104 మంది ఎమ్మెల్యేలతోపాటు ఏడుగురు ఎంఐఎం సభ్యులను కలుపుకొని 111 మంది ఎమ్మెల్యేలు ఉన్నా ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీజేపీ ప్రయత్నాలు చేసింది. మనం అప్రమత్తమై అందులో భాగస్వాములైన స్వామీజీల కుట్రలను బట్టబయలు చేశాం. ప్రధాని మోదీ దుర్మార్గుడు. తెలంగాణలో 64 మంది ఎమ్మెల్యేలున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీజేపీ బతకనిస్తుందా.. రేవంత్ బీజేపీలోకి వెళ్లినా, వెళ్లకున్నా కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చీల్చేందుకు బీజేపీ కచ్చితంగా ప్రయత్నిస్తుంది అని కేసీఆర్ పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో శరవేగంగా మార్పులు జరుగుతాయని.. కాంగ్రెస్‌పై తీవ్ర వ్యతిరేకత ప్రారంభమైందని కేసీఆర్ పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ తరఫున ఎవరికి అసెంబ్లీ టికెట్ ఇచ్చినా సునాయాసంగా గెలిచే పరిస్థితులు ఉంటాయన్నారు. రాజకీయాల్లో తొందరపాటు ఆలోచ నలు సరికాదని, కాంగ్రెస్‌లోకి వెళ్లిన నాయకులు అక్కడి పరిస్థితులు చూసి తిరిగి వస్తామంటున్నారని చెప్పారు. కొందరు నాయకులు పార్టీ నుంచి వెళ్లినంత మాత్రాన జరిగే నష్టమేమీ లేదని, బుల్లెట్లలాంటి నాయకులను తయారు చేసుకుంటామని పేర్కొన్నారు. కొందరు నాయకులు వెళ్లినపుడు కొంత మంచే జరుగుతుంద'ంటూ కడి యం శ్రీహరి పార్టీ వీడటాన్ని ప్రస్తావించి విమర్శించారు. "2006 కరీంనగర్ లోక్‌సభ ఉప ఎన్నికల సమయంలో చొప్పదండి నియోజకవర్గం పరిధిలోని పార్టీ మండల అధ్యక్షులు అందరూ కాంగ్రెస్‌కు అమ్ముడుపోయినా భారీ మెజారిటీ సాధించాం. డబ్బులు ఉంటేనే గెలుస్తామనే అభిప్రాయం సరికాదు. ఇప్పటివరకు అందిన సర్వే నివేదికల ప్రకారం రాష్ట్రంలో 8 పార్లమెంటు స్థానాల్లో గెలుస్తాం. మరో మూడు చోట్ల గెలుపు అవకాశాలు ఉన్నాయి అని కేసీఆర్ చెప్పారు. కాగా తెలంగాణ భవన్‌లో గురువారం జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన కేసీఆర్.. తొలుత తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేశారు. తర్వాత పార్టీ లోక్‌సభ అభ్యర్థులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర కీలక నేతలతో జరిగిన భేటీలో రాజకీయ పరిణామాలు, ఎన్నికల ప్రచార వ్యూహం, ఎజెండా, బస్సుయాత్ర వంటి అంశాలపై చర్చించి.. దిశా నిర్దేశం చేశారు. అనంతరం పార్టీ తరఫున పోటీ చేస్తున్న 17 మంది లోక్‌సభ అభ్యర్థులకు బీ ఫారాలను, ఎన్నికల ఖర్చు కోసం రూ.95లక్షల చొప్పున చెక్కులను అందజేశారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నిక అభ్యర్థి నివేదితకు బీ ఫారం, రూ.45 లక్షల చెక్కును అందజేశారు.

# కేటీఆర్ ట్వీట్ కు ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ కౌంటర్

### యువత భవిష్యత్తుకు ప్రభుత్వం గ్యారంటీ : బల్మూర్ వెంకట్



తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 19 (తీన్మార్ న్యూస్): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ట్వీట్ కు కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ ఏర్పడ్డాక మొట్టమొదటి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి, కేసీఆర్, కేటీఆర్ తెలంగాణ సమాజానికి ఒరగబెట్టింది ఏంటని ప్రశ్నించారు. ఇప్పుడు ఇంట్లో కుర్చీబెట్టాక తెలంగాణ యువత గుర్తుకు వచ్చిందా.. గత పదేళ్లుగా గుర్తుకు రాలేదా.. అని నిలదీశారు. అధికారంలో ఉన్నప్పుడు ఒక్కసారి అయినా వాళ్లని కలిసిన పాపాన పోలేదని.. ఇప్పుడు కేటీఆర్ ఎగిరి గంతేస్తున్నారని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ మేనిఫెస్టోలో విద్యార్థులు, యువతకు సంబంధించిన అంశం ఒక్కటి అయినా ఉందా.. ఇంటికో ఉద్యోగం అనే నినాదంతో 2014లో అధికారంలోకి వచ్చారని, గత పదేళ్ళలో ఊరికో ఉద్యోగం కూడా ఇవ్వలేకపోయారని.. కానీ మీ ఇంటి నిండా ఉద్యోగాలే అని బల్మూర్ వెంకట్అన్నారు. బీఆర్ఎస్ ఇచ్చిన ప్రతీ నోటిఫికేషన్‌లో చిక్కు ముడులేనని, తాను వేసినవి తప్పుడు కేసులు అయితే, న్యాయస్థానం ఎందుకు ఆ నోటిఫికేషన్‌లను రద్దు చేస్తుందని ప్రశ్నించారు. ఇప్పుడు కేటీఆర్ ఎవ్వరినీ తప్పు పడుతున్నారు. తననా లేక న్యాయస్థానాన్నా.. ఎమ్మెల్యే పదవిలో ఉండి ఏం మాట్లాడుతున్నారో తెలుసుకోవాలన్నారు. పేపర్ లీకేజీకీ కేటీఆర్ ఏమంటారు వాటికి కూడా తానే కారణం అంటారా లీకుల గురించి నోరు మెదిపితే ఎక్కడ మీ బాగోతం బయట పడుతుందోనని తెలివిగా లీకేజీ ప్రస్తావన తీయట్లేదని బల్మూర్ వెంకట్ విమర్శించారు. కాంగ్రెస్ నిరుద్యోగులకు ఇచ్చిన ప్రతీ హామీకి కట్టుబడి ఉన్నామని, ఇదీ ప్రజా ప్రభుత్వమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు ఇప్పటికీ ఎప్పటికీ యువతకు అందుబాటులోనే ఉన్నారని.. ఉంటారని స్పష్టం చేశారు. మునుపటి లాగా ప్రగతి భవన్‌లో కంచెలు వేసే రోజులు పోయాయన్నారు. కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకోవాలని, తెలంగాణ ఉసురు పోసుకుంది మీ కుటుంబమేనని ఆరోపించారు. వచ్చే ఎన్నికల వరకూ బీఆర్ఎస్ పార్టీ ఉంటదా? అనే సందేహం అందరికీ కలుగుతోందని.. తానెప్పుడూ.. ఎప్పుడి లాగానే నిరుద్యోగులను కలుస్తూ.. ఫోన్లో మాట్లాడుతున్నానని వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నానని బల్మూర్ వెంకట్ అన్నారు. మీలా నమ్మించి గొంతు కోసే రకం కాదన్నారు. అసలు కేసీఆర్, కేటీఆర్‌కు తెలంగాణ యువత గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. తెలంగాణ యువత సమస్యల పరిష్కారం కోసం ప్రజా ప్రభుత్వం నిబద్ధతతో ఉందని, తెలంగాణ యువత భవిష్యత్తుకు తమ ప్రభుత్వం గ్యారంటీ అని బల్మూర్ వెంకట్ స్పష్టం చేశారు.

# ఏప్రిల్ 23న సెలవు దినంగా ప్రకటించాలి

### వినాయక చవితి శ్రీరామనవమి లానే హనుమాన్ జయంతికీ సెలవు ప్రకటించాలి

### తెలంగాణ విశ్వహిందూ పరిషత్ బజరంగ్దళ్ నాయకులు డిమాండ్

హైదరాబాద్, ఏప్రిల్ 19 (తీన్మార్ న్యూస్): హిందువులు జరుపుకునే ముఖ్య పండుగలో హనుమాన్ జయంతి కూడా ఒకటి. అయితే ఈసారి హనుమాన్ జయంతి ఏప్రిల్ 23న వచ్చింది. హనుమాన్ జయంతి సందర్భంగా ఆ రోజు సెలవు ఇవ్వాలని తెలంగాణ విశ్వహిందూ పరిషత్ బజరంగ్దళ్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో విహెచ్పి రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు నరసింహమూర్తి పండరీనాథ్ అలానే శివరాములు మీడియాతో మాట్లాడారు. ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. వినాయక చవితి శ్రీరామనవమి పండుగలు అని హనుమాన్ జయంతి కూడా సెలవు దినంగా ప్రకటించాలని అన్నారు. ఈ సంవత్సరం కూడా వీర హనుమాన్ విజయ యాత్ర ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఈనెల 23వ తేదీన గౌలిగూడ శ్రీ రామ మందిరం నుండి తాడ్బండ్ హనుమాన్ మందిర్ దాకా నిర్వహించనున్నట్లు చెప్పారు అయితే ఈ రోజు సెలవుదినంగా ప్రకటించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు.

# ఢిల్లీ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురుతుంది

మొదటి పేజీ తరువాయి

ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ ఎందుకివ్వలేదని ప్రశ్నించారు. కాజీపేటకు రావాల్సిన కోచ్ ఫ్యాక్టరీని మోడి ఉత్తరాదికి తరలించుకుపోయారని ధ్వజమెత్తారు. మానుకోట కాంగ్రెస్ పార్టీకి ఎప్పటికీ కంచుకోట. ఎంపీ ఎన్నికల్లోనూ సీపీఐ, సీపీఐ(ఎం), జనసమితి పార్టీల మద్దతు తీసుకున్నాం. అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ను బండకేసి కొట్టారు. రాష్ట్రానికి అన్యాయం చేసిన మోడిని కూడా గద్దె దించాలి. రాష్ట్రంలో కేసీఆర్ దోపిడీకి ఢిల్లీలో మోడి సహకరించారు. కాళేశ్వరంలో రూ.లక్ష కోట్ల దోపిడీ జరిగినా మోడి చూస్తూ కూర్చున్నారు. అధికారంలోకి వచ్చిన పదేళ్ల తర్వాత మోడి ప్రభుత్వం రాష్ట్రానికి గిరిజన యూనివర్సిటీ ప్రకటించింది. తెలంగాణ ఏర్పాటును ప్రధాని ఎన్నోసార్లు అవమానించారు. రాష్ట్ర ఏర్పాటు చెల్లదని పార్లమెంట్ సాక్షిగా అన్నారు. రాష్ట్ర ఏర్పాటునే ప్రశ్నించిన బీజేపీకి ఎందుకు ఓటు వేయాలి, కుంభమేళాకు రూ.వేల కోట్లు ఖర్చు చేసిన మోడీ సర్కార్ మేడారం జాతరకు రూ.3 కోట్లు మాత్రమే ఇచ్చింది. బీజేపీ- బీఆర్ఎస్ కుమ్మక్కయ్యాయి. కవిత బెయిల్ కోసం మోడీతో కేసీఆర్ చేతులు కలిపారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఆయన కాళ్లదగ్గర కేసీఆర్ తాకట్టు పెట్టారు. 42 ఎంపీ సీట్లు ఉన్న తెలుగు రాష్ట్రాలకు ఒకే ఒక్క కేంద్ర మంత్రి పదవి ఇచ్చారు. తెలంగాణ ఇస్తే ఏపీలో పార్టీకి నష్టమని తెలిసి కూడా సోనియాగాంధీ రాష్ట్రం ఇచ్చారు. కొన్ని నెలలపాటు మణిపూర్ మండిపోతుంటే మోదీ అటువైపు కూడా వెళ్లలేదు. రాహుల్ మాత్రం మణిపూర్ వెళ్లి అందరితో మాట్లాడారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానన్న మోదీ ఖర్చులు మాత్రమే రెట్టింపు చేశారు అని సీఎం విమర్శించారు.

# హైదరాబాద్ నగరంలో రికార్డు స్థాయిలో డూప్లికేట్ ఓట్లు

హైదరాబాద్, ఏప్రిల్ 19 (తీన్మార్ న్యూస్): లోక్‌సభ ఎన్నికల వేళ ఎలక్షన్ కమిషన్ డూప్లికేట్ ఓట్లపై ఫోకస్ పెట్టింది. హైదరాబాద్ నగరంలో రికార్డు స్థాయిలో డూప్లికేట్ ఓట్లు ఉన్నట్లు ఎన్నికల సంఘం గుర్తించింది. ఈ క్రమంలో తెలంగాణలో ఉన్న 33 లక్షల ఓటర్లను తొలగించింది. ప్రధానంగా హైదరాబాద్ జిల్లాలో 5 లక్షల డూప్లికేట్ ఓట్లు తొలగించినట్లు ఈసీ పేర్కొంది. హైదరాబాద్‌లో అత్యధికంగా జూబ్లీహిల్స్, చాంద్రాయణగుట్టలో డూప్లికేట్ ఓట్లు ఉన్నట్లు ఈసీ గుర్తించింది. ఇక రాష్ట్ర వ్యాప్తంగా గత రెండేళ్లలో 32.8 లక్షల మంది ఓటర్లను తొలగించినట్లు ఈసీ పేర్కొంది. మరోవైపు గత రెండేళ్లలో దాదాపు 60.6 లక్షల మంది కొత్త ఓటర్లు చేరినట్లు సీఈఓ వికాస్ రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. జూబ్లీహిల్స్, చంద్రయాన్‌గుట్ట-61వేలు, ముషీరాబాద్, మలక్ పేట్- నాంపల్లి, బహదూర్‌పూర్‌లో 41వేల డూప్లికేట్ ఓట్లు, యాకుత్పురాలో-48 వేలు ఉన్నట్లు గుర్తించినట్లు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్ చెప్పారు. ఒక్క జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోనే 53,000 షిఫ్టెడ్ ఓట్లు ఉన్నట్లు ఎన్నికల అధికారులు గుర్తించారు చాంద్రాయణగుట్ట, యాకుత్‌పురాలో వరుసగా 59,289 ఓట్లు, 48,296 డూప్లికేట్ ఓట్లు గుర్తించామని ఎన్నికల సంఘం వెల్లడించింది.

# కేజ్రీవాల్‌ను జైల్లో చంపే కుట్ర జరుగుతోంది

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 19 (తీన్మార్ న్యూస్): ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను జైల్లో చంపే కుట్ర జరుగుతోందని ఆ పార్టీ నాయకురాలు, ఢిల్లీ రాష్ట్ర మంత్రి అతిషి ఆరోపించారు. టైప్ 2 డయాబెటిస్ పేషెంట్ అయిన కేజ్రీవాల్ పదేపదే అభ్యర్థనలు చేసినప్పటికీ ఆయనకు ఇన్సులిన్ ఇవ్వడం లేదని తెలిపారు. మద్యం పాలసీ స్కామ్ ఆరోపణలతో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను మార్చి 21న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్టు చేసింది. తాజాగా కేజ్రీవాల్ తన రెగ్యులర్ డాక్టర్‌తో వీడియో సంప్రదింపుల కోసం చేసిన అభ్యర్థనను ఈడీ వ్యతిరేకించిన అనంతరం ఆప్ నేతల నుంచి ఈ ఆరోపణలు వచ్చాయి. అరవింద్ కేజ్రీవాల్‌ను మూడు ఎన్నికల్లో (మూడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు) బీజేపీ ఓడించలేకపోతే, ఆయన్ను జైల్లో ఉంచి చంపేందుకు పథకం పన్నుతోంది అని అతిషి అన్నారు. అరవింద్ కేజ్రీవాల్ తీవ్రమైన మధుమేహంతో బాధపడుతున్నారని అందరికీ తెలుసు. ఆయనకు గత 30 సంవత్సరాలుగా ఈ సమస్య ఉంది. తన చక్కెర స్థాయిని అదుపులో ఉంచుకోవడానికి రోజూ 54 యూనిట్ల ఇన్సులిన్ తీసుకుంటారు అని ఆమె పేర్కొన్నారు. ఇంత తీవ్రమైన మధుమేహం ఉన్న వ్యక్తి మాత్రమే అంత ఇన్సులిన్ తీసుకుంటాడు. కావాలంటే ఏ డాక్టర్‌నైనా అడగండి అందుకే అరవింద్ కేజ్రీవాల్ ఇంట్లో వండిన ఆహారాన్ని తినడానికి, డాక్టర్ సూచించిన ఆహారాన్ని తినడానికి కోర్టు అనుమతించింది అన్నారు. అయితే బీజేపీ తన అనుబంధ సంస్థ (ఈడీ) ద్వారా కేజ్రీవాల్ ఆరోగ్యాన్ని చెడగొట్టేందుకు ప్రయత్నిస్తోందని, ఈడీ పదే పదే అబద్ధాలు చెబుతోందని అని ఆమె కోర్టులో ఏజెన్సీ వాదనలను తిప్పికొట్టారు. తన వైద్యుడితో సంప్రదింపు కోసం చేసిన అభ్యర్థనను వ్యతిరేకిస్తూ, మధుమేహ వ్యాధిగ్రస్తులు తినకూడని మామిడిపండ్లు, స్వీట్లను కేజ్రీవాల్ తింటున్నారని, చక్కెర కలిగిన టీ తాగుతున్నారని ఈడీ వాదించింది. దీనికి కౌంటర్ ఇస్తూ ఇది పూర్తిగా అబద్ధమని, డాక్టర్ సూచించిన స్వీటెనర్ తోనే టీ, స్వీట్‌లను కేజ్రీవాల్ తీసుకున్నారని అతిషి చెప్పుకొచ్చారు.

తీన్మార్
తెలుగు దినపత్రిక

# ఢిల్లీ గమ్యం ఎటు?

దేశ రాజధాని ఢిల్లీ పాలన అనిశ్చితంగానే కొనసాగుతున్నది. ఆప్, బిజెపి రాజకీయ వ్యూహ, ప్రతివ్యూహాల మధ్య ఢిల్లీ గమ్యం ఎటు, ఈ ప్రభుత్వ భవితవ్యం ఏమిటన్నది ఎవరూ చెప్పలేకపోతున్నారు. ఢిల్లీలో మే 25న ఎన్నికలు జరగబోతుండడంతో ఈ అనిశ్చిత పరిస్థితులకు కారణమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ తీహార్ జైలు నుంచి పాలన సాగించేందుకు జైలు నిబంధనలు అనుమతించకున్నా ఆయన అక్కడి నుంచే పాలన సాగిస్తున్నారు. ఇది రాజ్యాంగ విరుద్ధమని లెఫ్టినెంట్ గవర్నర్ సక్సేనా చెబుతూ ప్రత్యామ్నాయ ముఖ్యమంత్రిని ఎన్నుకోవాలని కోరుతున్నారు. లేదంటే రాష్ట్రపతి పాలన తప్పదని ఆయన హెచ్చరిస్తున్నారు. తన స్థానంలో మరో ముఖ్యమంత్రిని ఎన్నుకునే అవకాశమున్నా బిజెపి రాష్ట్రపతి పాలన విధిస్తే అది ఎన్నికల్లో తమకు అనుకూలిస్తుందని కేజ్రీవాల్ ప్రత్యామ్నాయ సిఎంను ప్రకటించడం లేదు. ఇది గ్రహించిన బిజెపి కూడా రాష్ట్రపతి పాలనకు తొందరపడడం లేదు. దీనితో ఢిల్లీ పాలన గందరగోళం మరి కొంత కాలం కొనసాగే అవకాశాలున్నాయి. ఈ కేసులోని విచారణపరమైన అంశాలతో సంబంధం లేకుండా కేజ్రీవాల్ ముఖ్యమంత్రిగా కొనసాగుతారని నిర్ధారించడానికి వీలులేని పరిస్థితి ఎదురైంది. దీంతో ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వం అగ్నిపరీక్షలో పడింది. కేజ్రీవాల్ జైలులో ప్రతివారం ఇద్దరు మంత్రులతో ఆయా విభాగాలకు సంబంధించి పాలనా పరమైన అంశాలపై చర్చిస్తారని, సమీక్షించి ఆదేశాలు జారీ చేస్తారని ఆమ్‌ఆద్మీ పార్టీ ప్రకటించింది. ఈ సందర్భంగా జైలు మేన్యువల్ నిబంధనల ఆచరణ చర్చకు దారి తీసింది. జ్యుడీషియల్ కస్టడీలో ముఖ్యమంత్రులు ఉన్నప్పుడు కల్పించిన అవకాశాలను ఆసరా చేసుకుని కేజ్రీవాల్ జైలు మేన్యువల్ గ్యాప్‌ను ఉపయోగించుకుంటున్నారని, జైలు అధికారులు కూడా దీనికి అనుమతిస్తున్నారన్న అభిప్రాయం వస్తోం ది. అయితే జైలు మేన్యువల్ కార్యాచరణ (మోడస్ ఆపరెండి) అలా లేదు. ముఖ్యమంత్రిగా జైలులో బాధ్యతలు నిర్వర్తించే అవకాశం అది కల్పించడం లేదు. కేబినెట్ సమావేశాలు నిర్వహించడం కానీ, ఫైళ్లను సమీక్షించడం కానీ జైలు మేన్యువల్ ప్రకారం వీలుకాదు. ముఖ్యమంత్రిగా కొనసాగడానికి కేజ్రీవాల్‌కు చట్టపరమైన అర్హత ఉన్నప్పటికీ, ఆ విధంగా విధులు నిర్వహించడానికి జైళ్ల మార్గదర్శకాలు ఒప్పుకోవు. ఈ విషయంలో ఖైదీల హక్కుల పరంగా జైలు మేన్యువల్ చాలా నిర్మాణాత్మకంగా ఉంది. విచారణలో (అండర్ ట్రయల్ ) ఉన్న ఖైదీలు తమ కుటుంబీకులకు, సన్నిహిత బంధువులకు, స్నేహితులకు, న్యాయవాదులకు ఆస్తికి సంబంధించిన వివాదాలపైనే సమాలోచనలు చేయవలసి ఉంటుంది. అలాగే ఆ మేరకు లిఖితపూర్వకంగా డాక్యుమెంట్లపై సంతకాలు చేయడానికి వీలుంటుంది. అంతేకానీ రాజకీయ చిక్కులతో ముడిపడి ఉన్న ఏ వ్యవహారంపైనయినా, సంబంధిత డాక్యుమెంట్లపై సంతకం చేయరాదు. ఈ నిబంధన జైలులో ఉన్న ఏ ముఖ్యమంత్రికైనా వర్తిస్తుంది. ముఖ్యమంత్రిగా సమర్థవంతంగా పనిచేసే అవకాశం ఈ నిబంధన కల్పించదు. ఈ కారణంగానే భూమి వ్యవహారంలో మనీలాండరింగ్ కేసులో జార?ండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను గత ఫిబ్రవరిలో ఇడి అరెస్ట్ చేసినప్పుడు ముఖ్యమంత్రిగా పాలన సాగించలేని పరిస్థితి ఏర్పడింది. ఆయన అరెస్ట్ అయిన తరువాత ముఖ్యమంత్రిని ఎన్నుకోవలసిన అవసరం ఏర్పడింది. రెండు రోజుల తరువాత జార?ండ్ ముక్తిమోర్చా నేత చంపాయి సోరెన్‌ను అక్కడి ప్రభుత్వం ముఖ్యమంత్రిగా నియమించుకుని ప్రమాణ స్వీకారం చేయించింది. నిబంధనల ప్రకారం లెజిస్లేటివ్ సభ్యుడు ఎవరైనా ఏదైనా కేసుల్లో అరెస్ట్ అయినప్పుడు జైలు నుంచి శాసన సభ స్పీకర్‌తో మాత్రమే సంప్రదింపులు జరపవలసి ఉంటుంది. కేజ్రీవాల్ విషయంలో అలా ఏం జరగడం లేదు. తన వారసునిగా ముఖ్యమంత్రి బాధ్యతలు చట్టపరంగా ఎవరికీ అప్పగించలేదు. అధికారికంగా ప్రభుత్వంలో ఎలాంటి హోదాలేని తన భార్య సునీతకు, పార్టీ ఎంఎల్ఎలకు, కార్యకర్తలకు జైలు నుంచే ఆదేశాలు అందిస్తున్నారు. తనతో పాటు ఆరుగురే తన ఆదేశాలు అమలు చేసేవారిగా కేజ్రీవాల్ చెబుతున్నారు.

ఈ ఆరుగురిలో పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ కూడా ఉన్నారు. కానీ చట్టపరంగా ఇదెంత వరకు ఆచరణయోగ్యం అన్నది ప్రశ్న. ఢిల్లీలో ఇప్పుడు రాజ్యాంగపరమైన పాలన విచ్ఛిన్నమైందన్న వాదన వస్తోంది. 1991లో రాజ్యాంగంలో చేరిన ఆర్టికల్ 239 ఎబి ఆధారంగా లెఫ్టినెంట్ గవర్నర్ ఢిల్లీలో పరిపాలన నిబంధనల ప్రకారం సాగడంలేదని చెబుతూ రాష్ట్రపతి పాలనకు సిఫార్సు చేసే అవకాశం కూడా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలోఅసాధారణ పద్ధతిలో ఢిల్లీ పాలనా వ్యవహారాలను ముఖ్యమంత్రి కేజ్రీవాల్ సాగించడం తనతోపాటు తన పార్టీని రాష్ట్రపతి పాలన చట్రంలో ఇరుక్కునేలా చేయడమవుతుంది. అందుకని ముఖ్యమంత్రి పదవి నుంచి కేజ్రీవాల్ వైదొలగి, లోక్‌సభ ఎన్నికల ప్రచారంపైనే దృష్టి కేంద్రీకరిస్తే చట్టపరమైన చిక్కులు తగ్గుతాయని రాజకీయ పరిశీలకులు సూచిస్తున్నారు.

# నేను హైటెన్షన్ వైర్...కేసీఆర్ టచ్ చేస్తే కాకిలా మాడిపోతావ్

- ఒక్క సారి తాకి చూస్తే కాకి ల మాడిపోతావని కేసీఆర్ కు హెచ్చరిక
- కాంగ్రెస్ ఎమ్మెల్యే లను టచ్ చేసి చూడు.. మాడి మసి అయిపోతావు
- ముందు నీ దొడ్లో ఎమ్మెల్యే లను కాపాడుకో.. రోజూ సాయంత్రం లెక్క పెట్టుకో
- 20 మంది ఎమ్మెల్యే లను తీసుకెళ్లే ధైర్యం, దమ్ము కేసీఆర్ లేదు..పిట్టల దొరలామాట్లాడుతున్నారు
- కారు షెడ్డు కు కాదు.. తుక్కుకు అమ్మడే
- అరుణమ్మ గెలుస్తే గాడిలలో వారు బాగుపడతారు..గల్లీల్లో ఉన్నవారు బాగుపడరు
- పాలమూరు కార్నర్ మీటింగ్ లో సీఎం రేవంత్ రెడ్డి
- ర్యాలీగా వెళ్లి వంశీచంద్ రెడ్డి నామినేషన్ పత్రాలు జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి రవి కి అందజేత





దేవరకద్ర ప్రతినిధి, ఏప్రిల్ 19(తీన్మార్ న్యూస్): ఎమ్మెల్యే లు చిటికెస్తే వస్తారని కేసీఆర్ పిట్టల దొర మాటలు మాట్లాడుతున్నారని, కాంగ్రెస్ ఎమ్మెల్యే ల కంచెకు హై టెన్షన్ కరెంట్ వైరుల కాపలా కాస్తానని, ఒక్క సారి ఈ వైరు ను తాకి చూస్తే కేసీఆర్ కాకి ల మాడి నల్లగా మారిపోతారని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. చిటికె కాదుగదా మిద్దె ఎక్కి డప్పుకొట్టిన అరిచినా కాంగ్రెస్ ఎమ్మెల్యే లు కంచె దాటరన్నారు. మహబూబ్ నగర్ పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గా చల్లా వంశీచంద్ రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి హాజరైన రేవంత్ రెడ్డి జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ ప్రాంతంలో నిర్వహించిన కార్నర్ మీటింగ్ లో ప్రసంగించారు. గతం లో కేసీఆర్ ముఠా తోడేళ్ల మాదిరిగా కాంగ్రెస్ ఎమ్మెల్యే ల పై పడ్డారని, ఇప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యే లకు రేవంత్ రెడ్డి అనే వ్యక్తి కాపలాగా ఉన్నాడని ఇప్పుడు కేసీఆర్‌కు దమ్ము, ధైర్యం ఉంటే ఒక్క ఎమ్మెల్యే ను టచ్ చేసి చూస్తే ఏమి జరుగుతుందో తెలుస్తుందన్నారు. మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు కారును బండకేసి కొట్టి వంద అడుగుల లోతున పాతిపెట్టారన్నారు. కాని కేటీఆర్ మాత్రం కారు రిపేర్ కోసం షెడ్డుకు వెళ్లిందని అంటున్నారని, కారు షెడ్డుకు కాదు పూర్తి గా ఇంజిన్ చెడిపోయి ఖరాబు అయిందని,ఆ కారును తుక్కుకు అమ్మడే అనే విషయం కేసీఆర్‌కు చెప్పాలన్నారు. ఏడు తారీకున ప్రమాణస్వీకారం చేస్తే ఆ భయానికి మీ నాన్న బొక్కలు విరిగిన విషయం గుర్తుపెట్టుకోవాలని కేటీఆర్ కు సూచించారు. కారు షెడ్డుకు పోయిందని పొంకణాలు చెప్తున్నా కేటీఆర్ కు, కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోతుందని పిట్టాదొరల మాట్లాడుతున్న కేసీఆర్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు తరిమికొట్టే రోజులు దగ్గరపడ్డాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆగస్టు 15 లోగా ముదిరాజ్ లకు మంత్రి వర్గం లో చోటు దక్కుతుందని రేవంత్ రెడ్డి హామీలు ఇచ్చారు. పాలమూరు జిల్లా కు వైద్య, ఇంజనీరింగ్, నర్సింగ్, జూనియర్, డిగ్రీ, కళాశాలు, 10 వేల కోట్ల లో అభివృద్ధి చేశామన్నారు. రూ.30 వేల కోట్లు కేంద్రం నుంచి రావాలని కొట్లాడుతున్నామన్నారు. గద్వాల గడి నుంచి దొరసాని బయలుదేరిందని, గద్వాల దొరలకైనా, గజ్వేల్ ఫార్మ్ హౌస్ దొరల ముందు బానిసలుగా బతక దలుచుకోలేదన్నారు. మీకాళ్ళ కింద చెప్పొ.. మీ నెత్తి పై గోడుగో.. లేకుంటే మీ చేతిలో చురకత్తి ల మారి..మాకు మేమూ చంపు కుంటామని కేసీఆర్ అనుకుంటున్నారని, మా శవాల పై నడుచు కుంటూ వెళ్లి ఓట్లు



దండుకుని పార్లమెంట్ లో అడుగుపెట్టాలని చూస్తున్నారన్నారు. జిల్లా అభివృద్ధి చెందాలంటే రెండు స్థానాలు గెలవాలని, ఆకాశం లో చందమామను అడగడం లేదు.. మీ ఆస్తులు అడగడం లేదు.. ఒక్క ఓటు మాత్రమే అడుగుతున్న మీ బిడ్డగా ఇంతవరకు ఎవరెవరికో ఓటు వేశారు. ఇప్పుడు మాకు వెయ్యండి పాలమూరు బిడ్డ ను ఇక్కడే పుట్టా ఇక్కడి మట్టిలో కలిసిపోతానా తరపున పార్లమెంట్ లో పోరాడే వ్యక్తి ని మనం పార్లమెంట్ పంపుదాం అరుణమ్మ పాలమూరు ప్రాజెక్టు కు జాతీయ హోదా అడిగిందా, ఆమె గెలుస్తే గాడిలలో ఉన్న వారు బాగుపడతారు కాని గల్లీల్లో ఉన్నవారు బాగుపడరని రేవంత్ అన్నారు. వంద రోజుల్లో పాలన పై కేసీఆర్ పిట్టల దొరల మాట్లాడుతున్నారని, ఢిల్లీలో మోదీ ని చూసాము ఇక్కడ గల్లీలో లో కేసీఆర్ అనే కేడి ని చూసాము,ఈ గడ్డమీద జెండా ఎగిరేది మనమే అని రేవంత్ రెడ్డి అన్నారు.

**మాదిగల వర్గీకరణ కోసం పోరాడుతాం**

ఎన్నో ఏళ్ళ నుంచి వర్గీకరణ చేయాలని మాదిగలు పోరాడుతుంటే బీఆర్ఎస్, బీజేపీ పట్టించుకోలేదని రేవంత్ రెడ్డి అన్నారు. గతం లో అసెంబ్లీ లో వర్గీకరణ కోసం ఎమ్మెల్యే లుగా ఉన్న నేను, సంపత్ కుమార్ కలిసి కేసీఆర్‌ను పట్టుబట్టి వర్గీకరణ బిల్లు పెట్టిస్తే పదేళ్ల కాలంలో ఏ బిల్లు పెండింగ్ లో ఉంచారని ఆయన పేర్కొన్నారు. గతం లో పార్లమెంట్, సుప్రీం కోర్ట్ లో వర్గీకరణ పై పోరాటం చేశామని, మళ్ళీ ఈ వర్గీకరణ కోసం పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని రేవంత్ రెడ్డి అన్నారు. వర్గీకరణ బిల్లు పార్లమెంట్ లో పెట్టేవరకు మాదిగల తరపున మేమూ పోరాడతామన్నారు. మీరు కొట్లాడ అవసరం లేదు. మీకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ కొట్లాడుతుందన్నారు. వర్గీకరణ విషయం లో బీఆర్ఎస్, బీజేపీ దొందు దొందే అని, ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఈ పార్టీ లను బొంద పెట్టాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. కార్నర్ మీటింగ్ అనంతరం కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి వంశీచంద్ రెడ్డి నామినేషన్ పత్రాలు జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి రవి అందజేశారు.

# 10 రోజుల్లో మాజీ సీఎం కేసీఆర్ రాజాపేట మీదుగా ఆలేరుకు రాక

- 29న ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశం ప్రచారం
- బిఆర్ఎస్ క్యాడర్ ను బిజెపిలో చేరమనడం దుర్మార్గం
- బిజెపికి ఓటేస్తే మురికి కాలువలో వేసినట్లే
- అబద్దాలతో ప్రభుత్వాన్ని రేవంత్ రెడ్డి నెట్టుకొస్తున్నారు
- తప్పు తెలుసుకున్న ఓటర్లు బిఆర్ఎస్ కు ఓటేస్తారు
- సన్నాహక సమావేశంలో గొంగిడి సునీత మహేందర్ రెడ్డి దంపతులు



రాజాపేట, ఏప్రిల్ 19(తీన్మార్ న్యూస్): పది రోజుల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలేరు లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు రాజపేట కూడా వచ్చే అవకాశం ఉందని, ఈనెల 29వ తేదీన టిఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశం ఆలేరులో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి, డిసిసిబి చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి లు అన్నారు. శుక్రవారం రాజపేట మీనాక్షి ఫంక్షన్ హాల్ లో సన్నాహక సమావేశం నిర్వహించిన సందర్భంగా వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అబద్దాలతో ప్రభుత్వాన్ని నెట్టుకొస్తున్నారని, అటు ప్రజలలో ఇటు కాంగ్రెస్ క్యాడర్లో నిరుత్సాహం ఏర్పడిందని అన్నారు. మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ ఫోన్ ద్వారా టిఆర్ఎస్ నాయకులను బిజెపిలో చేరాలని కోరడం విడ్డూరంగా ఉ




ందని దీంతో బిజెపిలో క్యాడర్ లేదనే విషయం ఆయనని చెప్పకనే చెబుతున్నాడని ఆరోపించారు. బిజెపికి ఓటేస్తే బురదలో వేసినట్లేనని అన్నారు. హుందాతనం లేని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విధానాలతో ఓటేసి నమ్మి మోసపోయామని ఓటర్లు భావిస్తున్నట్లు చెప్పారు. టిఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్ ఆలేరు నియోజకవర్గం నుండి 50 వేల మెజార్టీ అందజేయాలని కోరారు. ప్రతి కార్యకర్త నాయకుడు కేసిఆర్ లాగా క్యామ మల్లేష్ అనుకుని కష్టపడి ఎన్నికల్లో ప్రచారం చేయాలని వారు కోరారు. హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, కేంద్రంలో మోడీ ప్రభుత్వం అభివృద్ధిని పక్కన పెట్టి బిజెపియేతర ముఖ్యమంత్రిలను కూల్చేసి బిజెపి ప్రభుత్వాన్ని అడ్డదారిలో నిలబెట్టుకున్నారని ఆరోపించారు. రాజపేట మండలం నుండి అత్యధిక మెజారిటీ ఓట్లు బిఆర్ఎస్ కు ఇవ్వాలని కోరారు. రాజపేట మండల పార్టీ అధ్యక్షుని ఎన్నిక శనివారం ప్రకటించనున్నట్లు వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో సూదగాని హరిశంకర్ గౌడ్, ఎంపీపీ గోపగాని బాలమణి యాదగిరి గౌడ్, జెడ్పిటిసి సభ్యులు చామకూర గోపాల్ గౌడ్, రాజపేట మండల మహిళా అధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మి, చింతలపూరి వెంకట్ రామ్ రెడ్డి, మోత్కుపల్లి ప్రవీణ్, గొల్లపల్లి రాంరెడ్డి,పాండవుల భాను ప్రకాష్ గౌడ్, నాగిర్తి గోపి, గుంటి మధుసూదన్ రెడ్డి, సంధిలా భాస్కర్ గౌడ్, పల్లె సంతోష్ గౌడ్, డొంకెన మహేందర్ గౌడ్, ఆర్మాలగాల్ రెడ్డి, మేడిశెట్టి సత్యనారాయణ, ఎర్ర గోకుల జస్వంత్, కూతురు లింగం, చింతల దాస్, కటకం స్వామి, గుర్రం సిద్ధి రాములు, భోగ హరినాథ్, బోనాల వెంకటేశం, సింగారం తాజా మాజీ సర్పంచ్ కర్ల నరేందర్ రెడ్డి, కర్ణాకర్ రెడ్డి, గుంటి కృష్ణ, ఠాకూర్ ప్రమోద్ సింగ్, గుంటి కృష్ణ, నాగిర్తి జనార్దన్ రెడ్డి, మొలుగు సోమలింగం, జెల్ల శ్రీనివాసులు, రేకులపల్లి బిక్షపతి, భూపతి బాలరాజు, సింగారం బాలయ్య, చల్లూరు జానకిరామ్, జాల సురేష్, తదితరులు గా ఎన్నికైన సందర్భంగా గొంగిడి మహేందర్ రెడ్డిని టిఆర్ఎస్ మండల సెక్రెటరీ జనరల్ సంధిల భాస్కర్ గౌడ్, గొల్లపల్లి రాంరెడ్డి ఎడ్ల బాలలక్ష్మి లు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.



# నరసింగాపురం వాసికి ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్

దేవరకద్ర ప్రతినిధి, ఏప్రిల్ 19(తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా, మదనాపురం మండలం, నర్సింగాపురం గ్రామానికి చెందిన బక్షి రవీందర్ రావు కు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల బిఆర్ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బక్షి రవీందర్రావు జంతు శాస్త్ర సహాయ ఆచార్యులగా బక్షి రవీంద్రరావుకు పనిచేస్తున్నారు. జంతు శాస్త్రంలో, ఐ.సి.మ్.ఆర్ – ఎన్ఐఎన్ శాస్త్రవేత్త డాక్టర్. డి.రఘునాథ రావు పర్యవేక్షణలో "ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు యొక్క ఎగువ మరియు దిగువన గల రిజర్వాయర్లలో తిలాపియ చేప, మిగతా పెంపక చేపలపై కలిగించే ప్రభావం" గురించి చేసిన అధ్యయనానికి ఉస్మానియా యూనివర్సిటీ పిహె.డి. పట్టా ని ప్రకటించింది. బక్షి రవీందర్ రావు గత 26 సంవత్సరాలుగా వివిధ హోదాలలో విద్యాబోధన కొనసాగిస్తున్నారు. వివిధ జర్నల్స్ లో 10 పరిశోధన వ్యాసాలను ప్రచురించారు. కృష్ణా నదిలో గల వివిధ చేపల వైవిధ్యం గురించి మరియు దక్షిణాసియా దేశాలలో నివసించే అస్థి చేపల గురించి గ్రంథాలను ముద్రించారు. వివిధ జంతువుల గురించి ఆసక్తికర సమాచారాలను పత్రికల ద్వారా తెలియజేస్తుంటారు. బక్షి రవీందర్ రావుకు డాక్టరేట్ రావడం పట్ల



కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అప్పియ్య చిన్నమ్మ, అధ్యాపకులు మరియు భోదనేతర సిబ్బంది అభినందనలు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న మదనాపురం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గజ్జల నాగన్న, మాజీ యంపీపి మహదేవన్ గౌడ్, మాజీ సింగిల్ విండో చైర్మన్ గిన్నె శ్రీనివాస్ రెడ్డి, మదనాపురం మండల రైతు బంధు మాజీ అధ్యక్షుడు హనుమాన్ రావు, మన్నెం కొండ, తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి అభ్యర్థి గెలుపు కోసం కుర్రారం లో ప్రచారం



రాజాపేట, ఏప్రిల్ 19(తీన్మార్ న్యూస్): రాజాపేట మండలం, కుర్రారం గ్రామంలో శుక్రవారం బిజెపి పార్లమెంటు అభ్యర్థి బూర నరసయ్య గౌడ్ గెలుపు కోరుతూ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మోదీ ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్ గౌడ్, ఊట్కూరి భాను గౌడ్, మధు గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నాయకుడు జెడ్పిటిసి భర్తపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు

**- వృద్దురాలిపై దాడి**
**ప్రియురాలి భర్తను చంపడానికి ప్రయత్నించిన జెడ్పీటీసీ భర్త**
**- బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కుటుంబ సభ్యుల ఆందోళన**



పెబ్బేరు, ఏప్రిల్ 19(తీన్మార్ న్యూస్): ప్రియురాలు భర్తను చంపడానికి ప్రయత్నించిన పెబ్బేరు జెడ్పిటిసి భర్త పెద్దింటి వెంకటేష్ మరియు వారి తమ్ముళ్లపై పోలీస్ స్టేషన్లో శుక్రవారం ఫిర్యాదు చేసినట్టు బాధితుడు మరగల రాములు వారి కుటుంబ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల్లోకి వెళితే తన భార్యతో అక్రమ సంబంధం పెట్టుకోవడమే కాక నాతో సంసారం చేయకుండా జడ్పిటిసి భర్త అప్పటి బీఆర్ఎస్ అధికార పార్టీ అండదండలతో మా కుటుంబాన్ని చిన్నాభిన్నం చేశాడని ఈ విషయంలో గతంలో ఎన్నోసార్లు ఫిర్యాదు చేసిన మాపైన అక్రమ కేసులు పెట్టించాడని తెలిపారు. అంతేకాక శుక్రవారం ఉదయం నన్ను బైక్తో గుద్ధి అత్యాయత్నం చేయడానికి ప్రయత్నించాడు. దీనికి మా కుటుంబ సభ్యులు అడ్డురాగా జడ్పిటిసి మరియు భర్త పెద్దింటి వెంకటేష్ వారి తమ్ముళ్లు మా కుటుంబ సభ్యులను దూషించి వారిపై వేడి నీళ్లు చల్లి దాడి చేశారు. ఇనుపరాళ్ళతో కొట్టడం కొట్టారు. నాకు బీఆర్ఎస్ నాయకుడు పెద్దింటి వెంకటేష్ తో ప్రాణాహని ఉ ందని ఫిర్యాదులో పేర్కొన్నానని తెలిపారు. ఇట్టి విషయాన్నీ మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి దృష్టికి తీసుకెళతామని తక్షణమే బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు.

# ఏడాది కూడా ప్రకృతి కన్నెర్ర

**- కోతల ముందు వర్షాలు లేక, కోసే సమయంలో ఈదురు గాలులు**
**- వడగండ్లతో నిండా మునిగిన రైతులు**
**- ఈదురు గాలులతో నేల రాలిన మామిడి**
**- సర్వే చేసి పరిహారం చెల్లించాలంటూ మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత డిమాండ్**





రాజాపేట, ఏప్రిల్ 19(తీన్మార్ న్యూస్): ఈ ఏడాది కూడా పంట చేతికొచ్చే సమయంలో శుక్రవారం ఈదురు గాలుల వడగండ్లు చేతికొచ్చే పంటను మట్టిపాలు చేశాయి. పరిపంట కోతలకు ముందు వర్షాలు లేక అనేక పంటలు ఎండిపోగా, మిగిలిన పంట కోసే సమయంలో వడగండ్ల రూపంలో ఎదురుగాలులు వర్షం రైతులను నిండా మంచి అప్పులపాలు చేశాయి. మండలంలోని సింగారం జాల, కొత్తజాల, కుర్రారం, బూరుగుపల్లి పారుపల్లి రెవెన్యూ గ్రామాల పరిధిలోని వరి పంట ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వల్ల వరి గింజలు రాలిపోయి పంట నేల వాలిపోయింది. అనేకచోట్ల మామిడికాయలు రాలిపోయి మామిడి రైతులకు తీరని నష్టం కలిగించింది. ప్రాథమిక అంచనా ప్రకారం 200 ఎకరాల్లో వరి పంట, 10 ఎకరాల్లో మామిడి పంట నష్టం జరిగినట్లు రైతులు చెబుతున్నారు. గతంలో కూడా పంట నష్టపరిహారం చెల్లిస్తామని చెల్లించకపోవడాన్ని రైతులు గుర్తు చేస్తారు. ఆరుగాలం శ్రమించి పెట్టిన పెట్టుబడితోపాటు అప్పులు తీరుతాయని ఎంతో ఆశతో చూసిన రైతుల ఆశలు అడియాశలు అయ్యాయి. చేతికొచ్చిన పంట నేలపాలు కండ్ల ముందే కావడంతో రైతు కుటుంబాల కష్టాలు బాధలు వర్ణనాతీతం. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేల కొరకగా, వ్యవసాయ బావిల వద్ద షెడ్లు కూలిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి జాల సింగారం పరిసర ప్రాంతాల్లోని వడగండ్ల నష్టం వల్ల జరిగిన పంటలను పరిశీలించారు. ఎకరానికి రూ. 20,000/- చొప్పున ఎలాంటి షరతులు లేకుండా వెంటనేష్ట పరిహారం చెల్లించాలని కోరారు. జాల తాజా మాజీ సర్పంచ్ గుంటి మధుసూదన్ రెడ్డి, మదర్ డైరీ డైరెక్టర్ గొల్లపల్లి రామ్ రెడ్డి, బోనాల వెంకటేశం, ఇతర రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ విషయంపై వ్యవసాయ అధికారిని మాధవి మాట్లాడుతూ ఏఈఓ ల ద్వారా పంట నష్టాల వివరాలను తెలుసుకొని ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు చెప్పారు.





# కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు

**- పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి**



ఆత్మకూర్, ఏప్రిల్ 19(తీన్మార్ న్యూస్): ఆత్మకూరు మండలం కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరినవారు పిఏసిఎస్ చైర్మన్ గాడి కృష్ణమూర్తి, అమరచింత మండలం మాజీ రైతుబంధు సమితి అధ్యక్షులు చుక్క ఆశీ రెడ్డి, సర్పంచులు చుక్క లక్ష్మమ్మ, రామలింగమ్మ, శ్రీనివాస్ రెడ్డి, చలువ రెడ్డి, ఇతర సర్పంచులు, ఆత్మకూరు మండలం పిఎస్సిఎస్ డైరెక్టర్లు ములమల్ల సహదేవ్, నేతలు, కార్యకర్తలు, 200 మందికి పైగా శుక్రవారం రోజు నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో కాంగ్రెస్ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి అధికార ప్రతినిధి కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షులు నాగరాజు గౌడ్, ఆత్మకూరు మండలం అధ్యక్షుడు పరమేష్, అమరచింత మండల అధ్యక్షులు మహేందర్, ఆత్మకూరు మండలం మాజీ మండల అధ్యక్షులు రహమతుల, మక్తల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరు పట్టణ కేంద్రంలో బాత్రూంలు మూత్రశాలలు నిర్మించాలి

**- మున్సిపల్ చైర్ పర్సన్ కు కమిషనర్ కు వినతి పత్రం అందజేత**





ఆత్మకూరు, ఏప్రిల్ 19(తీన్మార్ న్యూస్): ఆత్మకూర్ మండల కేంద్రంలో శుక్రవారం రోజు భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆత్మకూరు పట్టణ కేంద్రంలో నాలుగు దిక్కులో బాత్రూంలో మరియు మూత్రశాలలు ఏర్పాటు చేయాలని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు నాలుగు పైపులు అనగా మదనాపూర్, చిన్నచింతకుంట అమరచింత, నర్వ, మండలాలలోని ప్రజలు పట్టణ కేంద్రంలోకి రోజు వారి అవసరాల నిమిత్తం కొనుగోలు చేసుకోవడానికి వస్తుంటారు. ఆత్మకూరు పట్టణ కేంద్రానికి బంగారం, దుస్తులు, కూరగాయలు, కిరాణం, మటన్ మరియు చికెన్ కొనుగోలు నిమిత్తం వస్తుంటారు. కావున మహిళలను దృష్టిలో ఉంచుకొని వారికి బాత్రూం మరియు మూత్రశాలలో నిర్మించాలని డిమాండ్ చేస్తూ, భారత కమ్యూనిస్టు పార్టీ ఆత్మకూరు మండలం ఆధ్వర్యంలో ఆత్మకూర్ మున్సిపల్ చైర్ పర్సన్ గాయత్రి రవి కుమార్ యాదవ్ కి మరియు ఆత్మకూర్ పురపాలక కమిషనర్ నాగరాజుకి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి రాబట్, జిల్లా నాయకులు శ్రీహరి, మండల సహాయ కార్యదర్శి మోష, జిల్లా నాయకులు శెట్టి, మండల నాయకులు లింగన్న, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి ఎక్కడ...?


**- రాష్ట్ర ప్రభుత్వానికి సూటి ప్రశ్న**
**- సూర్యాపేట జిల్లా ఏఐఎస్ఎఫ్ నాయకులు కొమ్మరాజు వెంకట్**



నేరేడుచర్ల, ఏప్రిల్ 19(తీన్మార్ న్యూస్): నేరేడుచర్ల పత్రిక ప్రకటన విడుదల చేసిన సూర్యాపేట జిల్లా ఏఐఎస్ఎఫ్ నాయకులు కొమ్మరాజు వెంకట్ మాట్లాడుతూ రాష్ట్రంలో పలు శాఖలతో పాటు విద్యాశాఖను కూడా సీఎం రేవంత్ రెడ్డి వద్ద ఉంచుకోవడం వల రాష్ట్ర వ్యాప్తంగా విద్య వ్యవస్థ పై సమీక్షలు లేకుండా రాష్ట్రంలో ఎన్నో రెసిడెన్షియల్ కాలేజీలలో స్కూళ్లలో కలుషిత ఆహారంతో, ఆత్మహత్యలతో విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నారు గాని ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం అదిరికారులపై నామ్ కే వాస్తు చర్యలు తీసుకోవడం ప్రజా పాలనకి నిదర్శనమా అని విద్యాశాఖ మంత్రిని ఏర్పాటు చేసి రాబోయే విద్యా సంవత్సరం నుంచి అయిన వ్యవస్థ పై సమీక్ష నిర్వహించి ఎటువంటి చిన్న పొరపాట్లు కూడా జరగకుండా గత ప్రభుత్వం హామీ ఇచ్చి విస్మరించిన కేజీ టు పీజీ ఉచిత నాణ్యమైన విద్య అందించే విధంగా కార్పొరేట్ వ్యవస్థకు అడ్డుకట్టలు వేస్తూ పేద విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. వెంట పట్టణ నాయకులు రెడ్డిపల్లి వినయ్ దాచేపల్లి, నరేష్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఈ అక్రమ కట్టడం పై చర్యలు తీసుకోరా..?

**- చర్యలు తీసుకుంటారా మనకెందుకులే అని వదిలేస్తారా...**
**- ప్రభుత్వ ఆదేశాలు బేఖాతర్**
**- నిద్రమత్తులో అధికారులు**



ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 19(తీన్మార్ న్యూస్): ఇబ్రహీంపట్నం మండలం, నెర్రపల్లి గ్రామంలో జరిగే అక్రమ కట్టడం పై చర్యలు తీసుకొని ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా చూడాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. నెర్రపల్లి గ్రామం నుండి దండుమైలారం వెళ్లే దారిలో సాయి గోకుల్ వెంచర్ కి ఆనుకొని ఎలాంటి అనుమతులు లేకుండా స్విమ్మింగ్ పూల్ తో పాటు రిసార్ట్ నిర్మాణం నిర్వహిస్తున్నారు. హెచ్ఎండిఏ నుంచి గాని గ్రామపంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా అక్రమ నిర్మాణం చేపడుతున్నారు. ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు తమకి రావలసిన మామూళ్లు తీసుకొని చూసి చూడనట్లు వ్యవహరిస్తు నిద్ర మత్తులో తూగుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు లోనై,మామూళ్లకు అలవాటు పడే అక్రమ నిర్మాణాని అడ్డుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ నిర్మాణం పై కొరడా ఝుళిపించాలని స్థానికులు కోరుతున్నారు. చర్యలు తీసుకుంటారా మనకెందుకులే అని వదిలేస్తారా..?

# వంగాల రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు

**- కుటుంబాన్ని ఓదార్చి, రూ.50000/- ఆర్థిక సహాయం**
**- అందజేసిన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం**





రామన్నపేట, ఏప్రిల్ 19(తీన్మార్ న్యూస్): మండలంలోని జనపల్లి గ్రామానికి చెందిన వంగాల రాజు ఇటీవల మరణించగా వారి చిత్రపటానికి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పూలమాలవేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు రూ. 50000/- ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి మల్లారెడ్డి, గంగుల రాజిరెడ్డి, మందడి రవీందర్ రెడ్డి, జడ్పిటిసి పున్న లక్ష్మి జగన్మోహన్, ఎంపిటిసి రేహాన్,
జనంపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చలమల లింగారెడ్డి, మాజీ సర్పంచ్ సంగిశెట్టి సుదర్శన్, వంగాల గోపాల్, బండ దామోదర్ రెడ్డి, పబ్బు వెంకటేష్, పల్లపు రాములు, రేఖ సైదులు, అక్కనపెల్లి నాగేష్, బండ అంజిరెడ్డి, ఎమ్ ఎన్ రెడ్డి, చలమల శ్రీనివాస్ రెడ్డి, తంగడపల్లి బాబు, గట్టు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# కురుమూర్తి స్వామి సేవలో అరుణమ్మ




దేవరకద్ర ప్రతినిధి, ఏప్రిల్ 19(తీన్మార్ న్యూస్): వచ్చే ఎన్నికల్లో విజయం సాధించేలా ఆశీస్సులు అందజేయాలని కురుమూర్తి స్వామివారిని వేడుకున్నారు. మహబూబ్ నగర్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి డీకే.అరుణమ్మ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం దేవరకద్ర నియోజకవర్గంలోని కురుమూర్తి స్వామి వారి క్షేత్రంలో స్వామివారి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కురుమూర్తి క్షేత్రానికి వెళ్లిన అరుణమ్మ మెట్ల మార్గంలో 300 మెట్లు ఎక్కి వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్ అనంతరం స్వామివారి దర్శనం కోసం వచ్చినట్లు తెలిపారు. స్వామి వారి ఆశీస్సులతో ఎన్నికల్లో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం అర్చకులు అరుణమ్మను ఘనంగా సన్మానించారు.

# శ్రీరామ నామ లిఖిత అక్షింతలు అందజేస్తున్న పాల్వాయి రమేష్ దంపతులు

**- రాములోరి శాంతి కళ్యాణానికి శ్రీరామనామ లిఖిత అక్షింతలు**



నేరేడుచర్ల, ఏప్రిల్ 19(తీన్మార్ న్యూస్): నేరేడుచర్ల పట్టణంలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయ ప్రతిష్ట మహోత్సవాల లో భాగంగా ఈనెల 21న నిర్వహించే శాంతి కల్యాణ మహోత్సవానికి శ్రీరామ నామ లిఖిత అక్షింతలను శుక్రవారం స్థానిక ప్రముఖ వ్యాపారి పాల్వాయి రమేష్ దంపతులు ఆలయ కమిటీకి అందజేశారు. హైదరాబాద్ పట్టణానికి చెందిన శ్రీరామ భక్తురాలు చలువాది మల్లి విష్ణు వందన భగవంతునిపై మక్కువతో సూక్ష్మ కళతో బియ్యపు గింజలపై శ్రీరామ, శ్రీరామ నామాలను లిఖించి పాల్వాయి రమేష్ దంపతుల ద్వారా అందజేశారు.విష్ణు వందన 2016 నుండి 7 లక్షల పైచిలుకు బియ్యపు గింజలపై శ్రీరామ నామాలు లిఖించి భద్రాద్రి రామయ్య కళ్యాణోత్సవం తో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక తదితర రాష్ట్రాలలోని అనేక దేవాలయాలలో శ్రీరామ కళ్యాణ వేడుకల కు బియ్యపు గింజలను అందజేశారు. తాజాగా నేరేడుచర్లలో జరుగుతున్న శ్రీ కోదండ రామాలయ దేవాలయ ప్రతిష్టాపన మహోత్సవాలలో జరిగే శాంతి కల్యాణానికి కూడా తనవంతుగా భక్తిశ్రద్ధలు చాటేందుకు శ్రీరామ నామ లిఖిత బియ్యపు గింజలను అందజేశారు.

# భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం



రామన్నపేట, ఏప్రిల్ 19(తీన్మార్ న్యూస్): భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో కొమ్మాయిగూడెం గ్రామంలో 41వ బూతులో భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ గెలుపు కొరకై ప్రచారం నిర్వహించారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు బండ మధుకర్ రెడ్డి, గ్రామ అధ్యక్షుడు గోపగోని అశోక్, శక్తి కేంద్రా ఇంచార్జ్ వీరమల్ల వీరేష్, బిజెపి నాయకులు బెల్లి లింగస్వామి, సింగు శంకర్ రెడ్డి, పోల్కంపల్లి శివ, రేపాక లింగస్వామి, ఐలాపురం అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో ఇప్పటికీ ఎస్సీలు వివక్షను ఎదుర్కొంటూనే ఉన్నారు

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

న్యూఢిల్లీ ఏప్రిల్ 19: దేశంలో ఇప్పటికీ ఎస్సీలు వివక్షను ఎదుర్కొంటూనే ఉన్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. షెడ్యూల్ కులం, షెడ్యూల్ ట్రయిబ్ అయినందుకు బిజెపి ప్రభుత్వం మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కొవింద్, ప్రస్తుత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము లను అగౌరపరిచిందన్నారు. రామ మందిర శిలాప్రతిష్ఠాపన ఉత్సవానికి ద్రౌపది ముర్మును ఆహ్వానించలేదు. కొత్త పార్లమెంటు భవన ప్రారంభోత్సవానికి కూడా ఆమెను పిలువలేదు. కాగా కొత్త పార్లమెంటు భవన శంకు స్థాపనకు కూడా కొవింద్ ను అనుమతించలేదన్నారు." ఒకవేళ నేను అయోధ్య విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి వెళ్లి ఉంటే వారు సహించేవారా?" అని ప్రశ్నించారు. మోడీ తాము 400కు పైగా పార్లమెంటు సీట్లను సాధిస్తామని అనడం అంతా చెత్త. తాను మూడోసారి అధికారంలోకి వస్తానని కలలు కంటున్నారు. కానీ అది సాధ్యం కాదు. ఎందుకంటే ప్రజలు మార్పును కోరుకుంటున్నారని ఖర్గే స్పష్టం చేశారు. వారిని మరో గెలిపించే విషయంలో హెచ్చరికగా ఉండాలని ఆయన ప్రజలను కోరారు. వారు మరోసారి అధికారం చేజిక్కించుకుంటే రాజ్యాంగాన్నే మార్చేస్తారని అన్నారు. ఇప్పటికే వారీ విషయం గురించి మాట్లాడుతున్నారని అన్నారు.రామ మందిరంలోకి ఎవరైనా వెళ్లాలనుకుంటే ఎప్పుడైనా వెళ్లవచ్చు?మోడీ ఏమీ పూజారి కాదు. విగ్రహ ప్రతిష్ఠాపనలో మోడీ అగ్రత్వం ఎందుకు తీసుకున్నాడు? ?అదంతా రాజకీయ ఉద్దేశ్యంతో చేసిందే. ఆలయానికి సంబంధించినంత వరకు మూడింట ఇంకా ఒక వంతు పనులు పూర్తే కాలేదు?అదంతా ఓ రాజకీయ కార్యక్రమమే కానీ ఆధ్యాత్మిక కార్యక్రమం కాదని ఖర్గే వివరించారు. మా కులం జనులను నేటికీ చాలా గుళ్లలోకి అనుమతించడం లేదు. కొన్ని గ్రామాల్లో నైతే త్రాగు నీరు, విద్య వంటి వాటికి దూరంగా ఉంచుతున్నారు. మా కులం పెళ్లి కొడుకును గుర్రాల మీద ఊరేగింపుగా వెళ్లడాన్ని కూడా అనుమతించడం లేదు. వారు అలాంటి వారిని కిందికి లాగేసి మరీ బాదుతున్నారు. ఇలాంటి స్థితిలో నేను మందిర విగ్రహ ప్రతిష్ఠాపనకు వెళ్లాలా? " అని ఖర్గే చెప్పుకొచ్చారు.

# 22 వరకు పాలీసెట్ దరఖాస్తు గడువు




పెబ్బేరు, ఏప్రిల్ 19(తీన్మార్ న్యూస్): రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో డిప్లొమా ఇన్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్, హార్టికల్చర్, యానిమల్ హస్బెండరి, ఫిషరీస్ కోర్సుల్లో ప్రవేశాలు పొందేందుకు పాలిసెట్ -2024 దరఖాస్తులకు ఈనెల 22వ తేదీ తుది గడువని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల, పెబ్బేరు ప్రిన్సిపాల్ ఎకే.శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి వార్షిక పరీక్షలు రాసిన విద్యార్థులు http://polycet.sbtet.telangana.gov.in లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

# నకిలీ విత్తనాలు సరఫరా చేసిన గ్రోమోర్

**– గ్రోమోర్ షాప్ కు తాళం వేసిన రైతులు**

**– నష్టపరిహారం చెల్లించాలని రైతుల డిమాండ్**




నసురుల్లాబాద్ : నకిలీ విత్తనాలతో నష్టపోయిన తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బీర్కూర్ మండల కేంద్రంలోని మన గ్రోమోర్ ఆఫీస్ కు తాళం వేసి కార్యాలయం ముందు రైతులు నిరసన వ్యక్తం చేశారు. విత్తనాల కంపెనీ రైతులకు అండగా నిల్వాల్సింది పోయి, రైతులు అడిగిన విత్తనాలు ఇవ్వకుండా కంపెనీకి లాభాలు తెచ్చిపెట్టే నాసిరకం విత్తనాలు రైతులను ఇచ్చి నట్టేట ముంచారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాసంగిలో బీర్కూరు మండలం లోని వివిధ గ్రామాలకు మన గ్రోమోర్ కంపెనీ నాసిరకం విత్తనాలు సరఫరా చేయడం తో రైతులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయడంతో వ్యవసాయ అధికారులు వేసిన పంటలను పరిశీలించారు. దీనితో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలంటూ రైతులు డిమాండ్ చేశారు. యాసంగీ సీజన్ పూర్తి అయిన నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వకపోవడంతో నేడు బీర్కూరు మండలం కేంద్రంలోని వివిధ గ్రామాల నుంచి రైతులు తరలివచ్చి మన గ్రోమోర్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తూ కార్యాలయానికి తాళం వేశారు. రైతులు గంగా కావేరి విత్తనాలు ఇవ్వాలని కోరగా మన గ్రోమోర్ బీర్కూర్ కంపెనీ, ఆర్కే సోనా కరీంనగర్ ప్రైవేట్ వ్యక్తుల నుంచి కొనుగోలు చేసి ఈ ప్రాంత రైతులకు ఎదురు దెబ్బ తగిలింది. వేసిన పంటకు తెగుళ్ల బారినపడి దిగుబడులు తగ్గిపోవడంతో, అన్నదాత శాస్త్రవేత్తలను సంప్రదించారు, వారం రోజుల క్రితం జగిత్యాల్, రుద్రూర్, కరీంనగర్, ప్రాంతాలకు చెందిన వరి విత్తన శాస్త్రవేత్తలు ఈ పంటలను పరిశీలించారు. పంటలు పూర్తిగా దిగుబడుల తగ్గిపోవడంతో రైతులు తమకు పరిహారం చెల్లించాలంటూ వారం రోజులుగా అధికారుల చుట్టూ తిరుగుతున్న ఫలితం దక్కపోవడంతో, నేడు బీర్కూర్ రైతులు కలిసి మన గ్రోమోర్ ముందు నిలబడి నిరసన వ్యక్తం చేశారు. తమ పంటలు దెబ్బ తినడానికి నకిలీ విత్తనాలు ఇచ్చిన మన గ్రోమోర్స్ కంపెనీ తక్షణం రైతులకు పరిహారం చెల్లించాలంటూ రైతులు డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేస్తున్నారు.

సోమవారం రైతులకు తో చర్చించి పరిహారం అందిస్తామని హామీ ఇచ్చిన మన గ్రోమోర్ కంపెనీ యజమాన్యం రైతులతో చర్చలకు రాకపోవడంతో రైతులు మన గ్రోమోర్ కంపెనీ వద్ద నిరసనకు దిగారు. తమకు పరిహారం ఇచ్చేవరకు తమ ఆందోళన విరమించేదే లేదంటూ రైతులు భీష్మించుకొని కూర్చున్నాను. రైతులు అడిగిన విత్తనాలు ఇవ్వకుండా ఇతర ఇతర కంపెనీలకు చెందిన విత్తనాలు సరఫరా చేయడం వాతావరణం భూమి లో మార్పులు రావడం వల్ల ఇలాంటి సంఘటనలు జరిగాయని బాన్సువాడ డివిజన్ వ్యవసాయ అధికారి స్వామి తెలిపారు. విత్తనాలు సరఫరాలో నాసిరకమని తెలిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.

# భూదాన్ భూ మాఫియాపై ఉక్కుపాదం మోపండి

**– అఖిల భారత సర్వసేవ సంసంఘ్ అధ్యక్షులు గోరంక చంద్ర మహాపాత్రో**




సుల్తాన్ బజార్: గత భూదాన యజ్ఞ బోర్డు చైర్మెన్ గున్న రాజేందర్ రెడ్డి తో సహా ఫోర్జరీ పత్రాలు సృష్టించి భూదాన భూములను దోచుకున్న భూదాన్ భూ మాఫియాపై ముఖ్యమంత్రి రేవం త్ రెడ్డి ప్రభుత్వం ఉ క్కుపాదం మోపాలని అఖిల భారత సర్వసేవ సంఘ్ ప్రధాన కార్యదర్శి గోరంక చంద్ర మహా పాత్రో విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో అన్యాక్రాంతమైన భూదాన భూములను తిరిగి స్వాధీనం చేసుకొని, భూమి లేని నిరు పేదలకు తక్షణమే తెలంగాణ భూదాన బోర్డును ఏర్పాటు చేసి పంపిణీ చేయాలనీ కోరారు. నాంపల్లి గాంధీ భవన్లో ఉన్న తెలంగాణ సర్వోదయ మండలి కార్యాల యంలో 74వ భూదాన దినోత్సవాలు ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ సర్వోదయ మండలి రాష్ట్ర అధ్య క్షులు ఆర్. శంకర్ నాయక్ అధ్యక్షత వహించగా గోరంక చంద్ర మహాపాత్రో తోపాటు అఖిల భారత సర్వసేవ సంఘ్ మేనేజింగ్ ట్రస్టీ షేక్ హుస్సేన్, మాజీ పార్లమెంట్ సభ్యులు సయ్యిద్ అజీజ్ పాషా తదితరులు హాజరై భూదాన యోధు డు ఆచార్య వినోబా భవే, భూదాన దాత వెదిరె రామచంద్ర రెడ్డిల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిం చారు.

ఈ సందర్భంగా గోరంక చంద్ర మహాపాత్రో మాట్లా డుతూ వేల ఎకరాల, వందల కోట్ల విలువైన భూదాన్ భూ కుంభకోణంపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేయాల న్నారు. తెలంగాణలో ఆచార్య వినోబా భావే సంపన్నులైన భూస్వాముల నుంచి విరాళంగా సేకరిం చిన భూదాన భూములను భూమి లేని నిరుపేదలకు పంపిణీ చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. షేక్ హుస్సేన్ మాట్లా డుతూ భూదాన్ ఉద్యమం సమ యంలో సుమారు 1, 77,333 ఎకరాల భూములను ధనిక భూస్వాములు స్వచ్ఛందంగా ఆచార్య వినోబా భవే కు అప్పగించారని, అం దులో అప్పటి ప్రభుత్వం కొంత మేరకు పేదలకు భూమిని పంపిణీ చేసిందని. గత ప్రభుత్వాలు లక్ష ఎకరాలకు పైగా మిగిలి ఉన్న భూదాన భూములను పేదల కు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడం వల్ల వేలాది ఎకరాలు అన్యాక్రాంతమైనవ ని, అందులో అధిక మొత్తంలో భూములను అప్పటి భూదా న యజ్ఞ బోర్డు చైర్మెన్ గున్న రాజేందర్ రెడ్డి నకిలీ పత్రాలు సృష్టించి అమ్ముకున్నాడని ఆరోపిం చారు. సయ్యిద్ అజీజ్ పాషా మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట యోధు లు రావి నారాయణరెడ్డి, సంఘ సంస్కర్త వెదిరె రామచంద్ర రెడ్డి వంటి మహామహులు భూమిలేని పేదల కోసం తమ భూములను ఆచార్య వినోబా భవే కు దానంగా ఇచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి తక్షణమే స్పందిం చి భూదాన భూ బకాసురులపై కఠిన క్రిమినల్ చర్యలు తీసుకొని, పేదలకు పంపిణీ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశా రు. ఆర్. శంకర్ నాయక్ మాట్లాడుతూ తెలంగాణ భూదాన యజ్ఞ బోర్డు గత చైర్మెన్ గున్న రాజేందర్ రెడ్డి పాత తేదీలతో ప్రొసీడింగ్స్ సృష్టించి భూదాన భూములను నేటికీ అమ్ము కుంటున్నాడని తెలిపారు. గున్న రాజేందర్ రెడ్డిపై కఠిన చర్యలు తీసుకొని, కబ్జా చేసిన భూములను తిరిగి స్వాధీనం చేసుకొని పేదలకు పంచాలని అయన డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో మండలి నేతలు కె. చందు, బి. భాస్కర్, గిరిప్రసాద్, యాదమ్మ, వి. విజయ, ఎస్. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# 'సికింద్రాబాద్'లో సమస్యల పరిష్కారానికి కృషి

**– కాంగ్రెస్ సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్**

**– సికింద్రాబాద్ పార్లమెంట్ గెలిపించి రాహుల్ గాంధీకి బహుమతిగా అందజేస్తాం : కోట నీలిమ**



బేగంపేట్: సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయమే లక్ష్యంగా శ్రేణులు పనిచేయాలని పిలుపునిచ్చారు. బేగంపేట్ లోని పైగా ప్యాలెస్‌లో సనత్ నగర్ కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి కమిటీ విస్తృత సమావేశం గురువారం నిర్వహించారు. కాంగ్రెస్ సనత్ నగర్ ఇంచార్జ్ టిపిసిసి ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దానం నాగేందర్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి బీజేపీలో కలు స్తారనే విష ప్రచారాన్ని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. కాంగ్రెస్ రాష్ట్రంలో అమలు చేస్తున్న గ్యారెంటీలతో ప్రభు త్వానికి మంచి గుర్తింపు వచ్చిందన్నారు. కాంగ్రెస్ సనత్ నగర్ ఇన్‌చార్జ్ డాక్టర్ కోటా నీలిమ మాట్లాడుతూ సనత్ నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు కచ్చితంగా మెజార్టీ వచ్చేలా చేస్తామని ప్రకటించారు.

మహిళా శక్తి కాంగ్రెస్ వెంటే ఉందని తెలిపారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో సికింద్రాబాద్ పార్లమెంటు గెలిచి రాహుల్ గాంధీకి బహు మతిగా ఇస్తామని తెలిపారు. రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రతి బూత్‌లో మెజార్టీ వచ్చే విధంగా బూత్ కమిటీలు పనిచేయాలని పిలుపు నిచ్చారు అప్పుడే గెలుపు సాధ్యమవుతుందని సూచించారు. ఫిరోజ్ ఖాన్ మాట్లాడుతూ బూత్ కమిటీ పార్టీకి అమ్మ వంటిదన్నారు. బూత్ కమిటీలోని కార్యకర్తలే పార్టీకి నిజమైన కార్యకర్తలని తెలిపారు. ప్రతి బూత్‌లో పార్టీ ను మరింత బలోపేతం చేయవలసిన బాధ్యత బూత్ కమిటీ లపై ఉందని సూచించారు. విజయ రెడ్డి మాట్లాడుతూ సికింద్రాబాద్ పార్లమెంటులో ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మరో 20 రోజులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కష్టపడి పని చేస్తే ప్రజల జీవితాలు మారుతాయని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రోహిత్, నాగేందర్ రాజ్, డాక్టర్ రవీందర్ గౌడ్, ఏ బ్లాక్ అధ్యక్షుడు త్రికాల మనోజ్ కుమార్, ఎస్సీ బ్లాక్ అధ్యక్షుడు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# కాగితాల పైనే కొనుగోలు కేంద్రాలు.. ధాన్యాన్ని అమ్ముకోవడానికి అరిగోస పడుతున్న అన్నదాతలు

కరీంనగర్ : మొన్నటిదాకా నీళ్లు లేక పంటలు ఎండితే.. అరకొరగా వచ్చిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి అన్నదాతలు అరిగోస పడాల్సి వస్తున్నది.

ఓ వైపు అకాల వానలు భయపెడుతుండగా.. ధాన్యం రైతు దైన్యస్థితిని ఎదుర్కోవాల్సి వస్తున్నది. ధాన్యం కొనుగోలు కేంద్రాలు భారీగా ప్రారంభించామని కాగితాలపై లెక్కలు చూపుతున్నా.. వాస్తవ పరిస్థితి పూర్తి భిన్నంగా ఉన్నది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని జగిత్యాల, కరీంనగర్, రాజన్నసిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లో కలిపి ఈ సీజన్‌లో 1,331 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈనెల 8 నాటికే 1,283 కేంద్రాలు ప్రారంభించినట్టుగా ప్రకటించారు. ఇందులో జగిత్యాల జిల్లాలో 418, కరీంనగర్‌లో 341, రాజన్నసిరిసిల్ల జిల్లాలో 259, పెద్దపల్లి జిల్లాలో 313 కేంద్రాలు ప్రారంభమైనట్టు అధికార యంత్రాగం చెబుతున్నది. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉన్నది. నేటికీ 50శాతం కేంద్రాల్లో కొనుగోళ్లు ప్రారంభం కాలేదు. ప్రారంభమైన చోట తేమ పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. కొన్నిచోట్ల ధాన్యం ఎండబెట్టినప్పటికీ.. వెంటనే కొనుగోలు చేయకపోవడంతో ఇటీవల కురిసిన జల్లులతో మళ్లీ తడిసింది. దీంతో రైతులు మళ్లీ ఆరబోయాల్సిన దుస్థితి ఏర్పడింది.



కేంద్రాల్లో ఉన్న ఇబ్బందుల నేపథ్యంలో అన్నదాతలు చేతికొచ్చిన ధాన్యాన్ని తెగనమ్ముకుంటున్నారు. ఇదే అదనుగా వ్యాపారులు, పలువురు రైస్‌మిల్లర్లు క్వింటాల్‌కు రూ.1800 చొప్పునే ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం ఫైన్ రకాలకు క్వింటాలుకు రూ.2,203, సాధారణ రకాలకు రూ.2,183 మద్దతు ధర ఉంది. ఈ లెక్కన క్వింటాల్‌పై రూ.400 వరకు రైతులు నష్టపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇస్తామని చేతులెత్తింది. ఒక వేళ ఇచ్చినా వ్యాపారులకు విక్రయించిన రైతులకు బోనస్ వర్తించదు. కొనుగోలు కేంద్రాల్లో ఇలాంటి పరిస్థితులు ఉన్నా మంత్రులెవరూ అటువైపు కన్నెత్తి చూడకపోగా.. అధికారులు ఎన్నికల విధుల్లో నిమగ్నమయ్యారు.

**గొల్లపల్లి మార్కెట్‌లో రైతుల దయనీయ పరిస్థితి**

జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని 18 రోజుల కింద ప్రారంభించారు. రైతులు భారీగా యార్డుకు ధాన్యం తెచ్చారు. కానీ నేటి వరకు ఒక్క కిలో ధాన్యం కొనలేదు. మాయిశ్చర్ పేరుతో కొనకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడు రోజుల కిందట వచ్చిన మబ్బులకు మార్కెట్‌లో పోసిన ధాన్యం కాపాడుకునేందుకు నానా పాట్లుపడ్డారు.

ఈ మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోళ్లను గొల్లపల్లి సహకార సంఘం చేస్తుంది. ఇంకా గన్నీ సంచులు కూడా రాలేదు. కొనుగోలు చేసిన ధాన్యం తరలించేందుకు మిల్లు అలాట్‌మెంట్ కూడా జరుగలేదు. జిల్లా అధికారులు స్పందించి మార్కెట్‌లో పేరుకుపోయిన ధాన్యాన్ని త్వరగా కొనుగోలు జరిగేలా చూడాలని రైతులు కోరుతున్నారు. ఇక్కడకు వచ్చిన ధాన్యంలో 80 శాతం ధాన్యం మిల్లర్లే కొనుగోలు చేస్తున్నారు. మొదట క్వింటాల్‌కు రూ.1800 పెట్టిన మిల్లర్లు, ఇప్పుడు రూ.1700 మాత్రమే ఇస్తున్నారు. లేదంటే 'మీ ఇష్టం' అంటూ రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని అందినంత దండుకుంటున్నారు

# చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాలు.. గరుడ ప్రసాదం కోసం తరలివచ్చిన భక్తులు.. భారీగా ట్రాఫిక్ జాం

హైదరాబాద్: ప్రసిద్ధ చిలుకూరు బాలాజీ ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో రెండో రోజైన నేడు గరుత్మంతునికి నైవేద్యం సమర్పించారు.

అనంతరం సంతానం లేని మహిళలకు ప్రసాదంగా పంపిణీ చేశారు. ప్రసాదం కోసం తెల్లవారుజామునే భక్తులు ఆలయానికి పోటెత్తారు. పెద్ద సంఖ్యలో భక్తులు క్యూలైన్లలో బారులు తీరడంతో కిలోమీటర్లమేర ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో ఆలయానికి వెళ్లేదారిలో రాకపోకలు నిలిచిపోయాయి. స్కూళ్లు, కాలేజీల బస్సులు కూడా ట్రాఫిక్‌లో చిక్కుకుపోయాయి. ట్రాఫిక్‌ను నియంత్రించలేక పోలీసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఇప్పటివరకు 60 వేల మందికిపైగా భక్తులు దేవస్థానానికి వచ్చారని మొయినాబాద్ సీఐ తెలిపారు. దేవస్థానం వద్ద ప్రస్తుతం గరుడ ప్రసాదం ఇవ్వడం లేదని, ఉదయం కొద్దిసేపు ఇచ్చాక ఆపేశారని చెప్పారు. ఆలయ అధికారులు చెప్పినట్లు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. 5వేల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు చెప్పారని, అయితే దానికి పది రెట్లకు మించి వచ్చారని వెల్లడించారు. ఒకేసారి వేలమంది రావడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయని చెప్పారు. బిలుకూరి బాలాజీ దేవాలయ రోడ్లలో ప్రజలు రావద్దని కోరారు. ఏటా శ్రీరామ నవమి తర్వాత దశమి నుంచి బాలాజీ ఆలయంలో వారం రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా మొదటిరోజైన గురువారం పుట్టమన్నుతో పూజకు అర్చకులు అంకుర్పారణ చేశారు. శుక్రవారం ఉదయం ధ్వజారోహణం, శేషవాహన సేవలు నిర్వహించారు. ఈ నెల 20న స్వామివారికి గోపవాహన, హనుమాన్ వాహన సేవలు నిర్వహిస్తారు. ఆదివారం సూర్యప్రభ వాహనం, గరుడవాన సేవలు, అదేరోజు రాత్రి 10.30 గంటలకు స్వామివారి కల్యాణోత్సం నిర్వహించనున్నారు. ఇక ఈ నెల 22న వసంతోత్సవం, గజవాహన సేవలు, 23న పల్లకి సేవ, అర్ధరాత్రి 12 గంటలకు స్వామివారి దివ్యరథోత్సవం, 24న మహాభిషేకం, ఆస్థాన



సేవ, అశ్వవాహన సేవ, దోప్ సేవ, పుష్పాంజలి సేవలు నిర్వహిస్తారు. చివరి రోజైన 25న ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

# బస్టాండ్ లో నిలువు దోపిడి

కరీంనగర్: తెలంగాణలో హైదరాబాద్ తర్వాత రెండో అతిపెద్దది కరీంనగర్ బస్టాండ్ అని తెలిసిందే. మరి అలాంటి కరీంనగర్ బస్టాండ్లో ప్రయాణికుల నుంచి వ్యాపారస్తుల నిలువు దోపిడి సాగుతుందా...? అంటే అవునని వినిపిస్తోంది. కరీంనగర్ బస్టాండ్ మీదుగా రోజూ కొన్ని వందల బస్సులు వెళుతూ ఉంటాయి. నిత్యం వేలాదిమంది ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు వెళ్లేవారు ప్రేమ్ నగర్ ఆర్టీసీ బస్టాండ్ కు చేరుకుంటారు. బస్సుల కోసం వేచి చూసే ఆ ప్రయాణికులు ఆర్టీసీ బస్టాండులో కొనే నీళ్ల నుంచి ఆహార పదార్థాల వరకూ వారిని నిలువు దోపిడీ చేస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ఎమ్మార్పీ కంటే ఎక్కువ డబ్బులు వసూలు చేస్తూ ప్రయాణికులను మోసం చేస్తున్నారు. నాసిరకమైన తినుబండారాలను విక్రయిస్తూ ప్రయాణికుల ఆరోగ్యంతో సైతం ఆడుకుంటున్నారని ఆరోపణలున్నాయి. ఇదేంటి అని ప్రశ్నిస్తే నాకు తెలియదు, ఓనర్‌ను అడగాలని షాపుల్లోని వారు చెబుతున్నారు. కరీంనగర్ బస్టాండ్ లోని దుకాణాల్లో అధిక వసూళ్లు, నాసిరకమైన అమ్మకాలపై ఏబీపీ దేశం స్పెషల్ స్టోరీ...కరీంనగర్ బస్టాండ్ లో మొత్తం 40 వరకు దుకాణాలు ఉండగా ప్రతిరోజూ సుమారు వందల బస్సులు వేల ట్రిప్పులు వేస్తుంటాయి. నిత్యం రెండు లక్షలకు పైగా ప్రయాణికులు ప్రయాణం సాగిస్తుంటారు. ఈ బస్టాండ్ లోని దుకాణాలలో వాటర్ బాటిల్స్, సమోసాలు, మిర్చీలు, చిప్స్, బిస్కెట్ ప్యాకెట్లు ఇతర తిను బండారాలు సహా కూల్ డ్రింక్స్ విక్రయిస్తుంటారు. అసలే వేసవికాలం కావడంతో బస్సుల కోసం వేచి చూసే ప్రయాణికులు లైట్ స్నాక్స్ తీసుకుందామని తిను బండారాలు కొన్నా, దాహంగా ఉందని కూల్ డ్రింక్స్, వాటర్ బాటిల్స్ కొన్నా.. అధిక ధరలకు విక్రయిస్తున్నారు. మరోవైపు నాసిరకమైన ఉత్పత్తులను విక్రయిస్తూనే ఎమ్మార్పీ ధరల కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. కొరిక్యల గ్రామానికి చెందిన ఓ ప్రయాణికుడు సిద్ధిపేటకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో దాహం వేసి కరీంనగర్లోని బస్టాండ్ లో కూల్ డ్రింక్ తీసుకున్నాడు. కానీ ఎమ్మార్పీ కంటే పది రూపాయలు ఎక్కువ తీసుకుంటున్నారు. అదేంటి అని అడిగితే ఇక్కడ ఇలాగే విక్రయిస్తామని దుకాణదారుడు అన్నారని ప్రయాణికుడు తెలిపారు. మరో ప్రయాణికుడు కరీంనగర్ నుంచి హైదరాబాదుకు వెళ్లే తన స్నేహితులను బస్సు ఎక్కించేందుకు వచ్చాడు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో బస్టాండ్ లోని ఓ షాపు వద్దకు వెళ్లి మూడు కూల్ డ్రింక్స్ తీసుకోగా ఒక్కో దానిపై పది రూపాయలు ఎక్కువ తీసుకున్నారని తెలిపారు. దీనిపై ప్రశ్నించేవారు లేరా ఎవరైనా అధికారులు చర్యలు తీసుకుంటే బావుంటుందని అన్నారు. కరీంనగర్ బస్టాండ్ లో జరుగుతున్న నిలువు దోపిడి, నాసిరకమైన వస్తువులు, పదార్థాల అమ్మకాలపై ఏబీపీ దేశం వివరణ కోరగా.. ఇక్కడ జరిగే అలాంటి వాటిపై తమకు ఎలాంటి సంబంధం లేదన్నారు. గతంలో కూడా నాణ్యత లేని పదార్థాలు విక్రయించడం, ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయాలు జరపడంపై తమకు కంప్లైంట్ వస్తే చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఎవరైనా ప్రయాణికులు తమకు రాత పూర్వకంగా కంప్లైంట్ ఇస్తేనే చర్యలు తీసుకుంటామని చెప్పారు. నాణ్యత విషయానికొస్తే.. ఆహార భద్రత శాఖ వారు ఈ విషయంపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. కరీంనగర్ బస్టాండ్లో జరుగుతున్న నిలుదోపిడి, నాసిరకమైన వ్యాపారాలపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో తెలియాలంటే వేచి చూడక తప్పదు.

# సండే..నాన్ వెజ్ లవర్స్ కు షాక్..

హైదరాబాద్: ఆదివారం వచ్చిందంటే ఇళ్లలో నాన్ వెజ్ వంటల ఘుమఘుమలాడుతుంటాయి. ఇక హైదరాబాద్ లో అయితే ఆదివారం చికెన్, మటన్ షాపుల ముందు రద్దీ కనిపిస్తుంది. వారం అంతా డ్యూటీలు, ఇతర పనులతో బిజీ బిజీగా ఉండే నగర వాసులు ఆదివారం... ఓ ముక్క, అలవాటుంటే సాయంత్రం ఓ చుక్క వేసుకుంటారు. దీంతో ముఖ్యంగా ఆదివారం నాన్ వెజ్ విక్రయాలు అధికంగా ఉంటాయి. కానీ హైదరాబాద్ వాసులకు ఓ చిన్న బ్యాడ్ న్యూస్... ఏంటంటే వచ్చే ఆదివారం(ఏప్రిల్ 21)న సిటీలో నాన్ వెజ్ దొరకదు. చికెన్, మటన్, ఇతర నాన్ వెజ్ విక్రయాలు ఉండవు. కారణంగా ఏంటంటే...మహావీర్ జయంతి సందర్భంగా హైదరాబాద్ లోని కబేళాలతో పాటు అన్ని మాంసం దుకాణాలను వచ్చే ఆదివారం మూసివేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ ఉత్తర్వులు జారీ చేశారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాలతో ఆదివారం మాంసం దుకాణాలు మూతపడనున్నాయి. జైనులకు మహావీర్ జయంతి చాలా ముఖ్యమైన పండుగ. జైనులు జరుపుకునే పండుగలలో మహావీర్ జయంతి చాలా ముఖ్యమైనది. అహింసను ప్రబోధించిన జైన మత ప్రచారకుడు, వర్ధమాన మహావీరుడి జయంతిని ప్రతిసంవత్సరము చైత్ర మాసంలో ఘనంగా జరుపుకుంటారు. 36వ ఏట సన్యాసాన్ని స్వీకరించిన వర్ధమానుడు.. 12 ఏళ్ళ పాటు తపస్సు చేసి మహావీరుడుగా జైనమత ప్రచారకుడయ్యారు. అప్పటికే జైన మతానికి 23 మంది తీర్థంకరులుగా ఉన్నప్పటికీ మహావీరుడు బాధ్యతలు చేపట్టిన తర్వాతే ఆ మతానికి సంబంధించిన వివరాలు వెలుగు చూసినట్లుగా చెబుతారు. 32 ఏళ్ళ పాటు అహింసా ధర్మంతో మత ప్రచారం జరిపిన మహావీరుడు 72వ ఏట మరణించారు. జన్మదినం సందర్భంగా హైదరాబాద్‌లోని కబేళాలతో పాటు మాంసం దుకాణాలను మూసివేయాలని ఆదేశించినట్లు జీహెచ్ఎంసీ రొనాల్డ్ రాస్ తెలిపారు. హైదరాబాద్ సిటీలో మాంసానికి ఉన్న డిమాండ్ మరే నగరంలోనూ ఉండని సంగతి తెలిసిందే. పెద్ద సంఖ్యలో ఉన్న జనాభాతో పాటు వేలాది సంఖ్యలో ఉన్న హోటళ్లు, రెస్టారెంట్లు కూడా భారీ మొత్తం మాంసం కొనుగోలు చేస్తుంటాయి. ఆదివారం షాపుల మూసివేత కారణంగా వీరికి కాస్త నష్టం ఎక్కువగా ఉండనుంది. కానీ, ఈ ఉత్తర్వుల గురించి తెలిసిన వారు మాత్రం ముందు రోజే తాజా మాంసాన్ని కొనుగోలు చేసుకొని ఫ్రిడ్జ్ లో నిల్వ చేసుకొని ఆదివారాన్ని యథాతథంగా జరుపుకోనున్నారు. తిరిగి సోమవారం యథావిధిగా కబేళాలు తెరుచుకోవచ్చని కమిషనర్ చెప్పారు. హైదరాబాద్ లోనూ జైనుల సంఖ్య గణనీయంగా ఉండడంతో... మహావీర్ జయంతి నాడు నగరంలో మాంసం విక్రయాలపై ఆంక్షలు విధించింది జీహెచ్ఎంసీ. ఈ నిర్ణయానికి ప్రజలు సహకరించాలని కోరింది. నిబంధనలు అతిక్రమించి ఎవరైనా మాంసం షాపులు ఓపెన్ చేస్తే కఠిన చర్యలు ఉంటాయని జీహెచ్ఎంసీ కమిషనర్ హెచ్చరించారు. జీహెచ్ఎంసీ సిబ్బంది ఈ ఉత్తర్వులను అమలు చేయడంలో అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సోమవారం యథావిధిగా కబేళాలు తెరుచుకోవచ్చని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# పొన్నం ప్రభాకర్ కు పిచ్చి పట్టినట్లుంది

## -వెంటనే ట్రీట్ మెంట్ చేయించండి
## -సుప్రీంకోర్టునే అవమానించేలా పొన్నం మాట్లాడతారా?
## -ఎలక్ట్రోరల్ బాండ్స్ కు, బెయిల్ కు సంబంధమేంది?
## -పొన్నం వ్యాఖ్యలను న్యాయస్థానం సుమోటోగా తీసుకోవాలి
## -మంత్రి పొన్నంపై బీజేపీ నేతలు ఎస్.కుమార్, సంగప్ప, గుగ్గిళ్ల ఫైర్

కరీంనగర్,: లిక్కర్ స్కాం నిందితుడు వ్యాపారవేత్త శరత్ చంద్రారెడ్డి బీజేపీకి రూ.500 కోట్ల విలువైన ఎలక్ట్రోరల్ బాండ్స్ ఇవ్వగానే బెయిల్ వచ్చిందంటూ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలపై భారతీయ జనతా పార్టీ తీవ్రంగా స్పందించింది. ఎలక్ట్రోరల్ బాండ్స్ కు, బెయిల్ కు సంబంధమేందని ప్రశ్నించింది. పొన్నం వ్యాఖ్యలు న్యాయ స్థానాన్నే అవమానించేలా ఉన్నాయని మండిపడింది. పొన్నం తీరును చూస్తుంటే ఆయనకు పిచ్చి పట్టినట్లుందని అనుమానం వ్యక్తం చేసింది. తక్షణమే ట్రీట్ మెంట్ ఇవ్వాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. గౌరవ న్యాయ స్థానం సైతం పొన్నం వ్యాఖ్యలను సుమోటోగా తీసుకుని ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరింది. ఎవరెన్ని కుట్రలు చేసినా బండి సంజయ్ కుమార్ 4 నుండి 5 లక్షల బంపర్ మెజారిటీతో ఎంపీగా గెలిచి చరిత్ర సృష్టించబోతున్నారని ధీమా వ్యక్తం చేసింది. కరీంనగర్లోని ఎంపీ కార్యాలయంలో ఎస్.కుమార్, రాష్ట్ర అధికార ప్రతినిధి జె.సంగప్ప, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ల రమేశ్, కుమ్మరి శంకర్, కరండ్ల మధుకర్, రమణారెడ్డి, సొల్లు అజయ్ వర్మ తదితరులు ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత ఎస్ కుమార్ మాట్లాడుతూ? “కాంగ్రెస్ రాష్ట్ర నేతలు అధికారం ఉంది కదా అని అడ్డగోలుగా మాట్లాడుతున్నారు. చివరకు సుప్రీంకోర్టుపై కూడా మాట్లాడే పరిస్థితి వచ్చింది. మంత్రి పొన్నం ప్రభాకర్ న్యాయ వ్యవస్థపై కూడా అభాండాలు మోపుతున్నారు.. తన స్థాయికి మించి బీజేపీ నేతలపై మాట్లాడుతున్నారు? బూతులు మాట్లాడితే, తిడితే పేరొస్తుందనుకుంటే పొరపాటు. బీఆర్ఎస్ నేతలు కూడా గతంలో ఇట్లనే మాట్లాడితే ప్రజలు ఏ రకమైన తీర్పు ఇచ్చారో తెలుసుకోవాలి. కాంగ్రెస్ నేతలది కూడా బీఆర్ఎస్ యూనివర్శిటీలోనే చదువుకున్నట్లున్నారు.. లిక్కర్ స్కాంలో నిందితుడు శరత్ చంద్రారెడ్డి రూ.500 కోట్ల విలువైన ఎలక్ట్రోరల్ బాండ్స్ ఇచ్చినందుకు ప్రతిఫలంగానే బెయిల్ వచ్చిందని పొన్నం మాట్లాడటం సిగ్గు చేటు. ఎలక్ట్రోరల్ బాండ్స్ కు, బెయిల్ కు సంబంధమేంది? పొన్నం వ్యాఖ్యలను న్యాయ వ్యవస్థ సీరియస్ గా తీసుకోవాలి? కరీంనగర్ ఎంపీ ఎన్నికల్లో బండి సంజయ్ 4 నుండి 5 లక్షల మెజారిటీతో గెలవబోతున్నారని తేలడంతో పొన్నంకు భయం పట్టుకుంది. కాంగ్రెస్ నుండి అభ్యర్థే కరువయ్యారు. ఈ ఆందోళనతోనే పొన్నం ఇష్టమొచ్చినట్లుగా మాట్లాడుతున్నరు? దేశంలో ఏ సర్వే చూసినా నరేంద్రమోదీ ప్రభుత్వానికి 400 సీట్లు వస్తాయని తేలడంతో కాంగ్రెస్ నేతలు అడ్డగోలుగా మాట్లాడుతున్నరు.”అని వ్యాఖ్యానించారు.

అనంతరం సంగప్ప మాట్లాడుతూ.. “ఎవరైనా మంత్రి అయితే వారి గౌరవం పెరిగేలా వ్యవహరిస్తారు..కానీ పొన్నం ప్రభాకర్ మాత్రం మంత్రి కాగానే తన స్థాయిని తానే తగ్గించుకునేలా మాట్లాడుతున్నరు. బీజేపీపైన, మోదీపైన, ఎంపీపైన అడ్డగోలుగా మాట్లాడుతున్నరు.. పొన్నం ప్రభాకర్? నీ స్థాయి ఏమిటో కరీంనగర్ ప్రజలను అడిగితే తెలుస్తుంది. కరీంనగర్ లో నీకు రాజకీయ భవిష్యత్తు లేదని తెలిసి.. హుస్నాబాద్ పారిపోయినవ్. నువ్వా ప్రధాని గురించి మాట్లాడేది. దేశ సేవ కోసం కుటుంబాన్ని పక్కన పెట్టిన మహానేత. ఆయనపై అవినీతి ఆరోపణలు చేస్తావా? ఎలక్ట్రోరల్ బాండ్స్ కాంగ్రెస్ సహా అన్ని పార్టీలకు వచ్చినయ్. రాజకీయాల్లో నల్లధనం ఉండకూడదనే లక్ష్యంతో మోదీ ప్రభుత్వం దేశ చరిత్రలోనే సంచలనమైన ఎలక్ట్రోరల్ బాండ్స్ విధానాన్ని తీసుకొచ్చారు.. నల్లధనాన్ని అరికట్టేందుకు ఈ విధానం తీసుకొస్తే? నల్లధనంపై ఆధారపడ్డ కాంగ్రెస్ అల్లాడిపోయింది. డీజిల్ కు కూడా పైసల్లేవని గగ్గోలు పెడుతోంది? సుప్రీంకోర్టు ద్వారా శరత్ చంద్రారెడ్డికి బెయిల్ వచ్చింది..కానీ పొన్నం వ్యాఖ్యలు సుప్రీంకోర్టునే అవమానించినట్లున్నాయి. వెంటనే గౌరవ సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలి. సుమోటోగా తీసుకుని పొన్నంపై చర్యలు తీసుకోవాలి. జైల్లో వేయాలి. బండి సంజయ్ గురించి మాట్లాడే అర్హత పొన్నం లేదు. నిజాయితీ రాజకీయాలకు, ప్రజాసేవకు నిదర్శనం బండి సంజయ్. మోదీ, బండి సంజయ్ లను విమర్శించడమంటే? ఆకాశంపై ఉమ్మేసినట్లే ఉంటుందని గుర్తుంచుకుని మాట్లాడాలి? ఎలక్ట్రోరల్ బాండ్స్ ఇస్తే బెయిల్ ఎట్లా వస్తది? మీ ఇంట్లో లాయర్లు ఉన్నరు కదా? వెంటనే వెళ్లి తెలుసుకో? నాకు తెలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ కు మెంటల్ బ్యాలెన్స్ తప్పినట్లుంది. పిచ్చి పట్టినట్లు వ్యవహరిస్తున్నరు. దయచేసి ట్రీట్ మెంట్ ఇవ్వాలని కోరుతున్నా?”అని పేర్కొన్నారు.

గుగ్గిళ్ల రమేశ్ మాట్లాడుతూ? “బండి సంజయ్ చేసిన పోరాటాలవల్లే ఈరోజు కేసీఆర్ సర్కార్ ను ప్రజలు గద్దె దింపారు. గుడ్డిలో మెల్లగా పొరపాటున కాంగ్రెస్ అధికారంలోకి వచ్చారు.. అంతే తప్ప గత ఐదేళ్లలో ఏనాడూ కాంగ్రెస్ కానీ, పొన్నం కానీ పోరాటాలు చేయలేదు? పైగా పొన్నం బీఆర్ఎస్ తో కుమ్మక్కై చీకటి ఒప్పందాలు చేసుకుని పనిచేస్తున్నారు.. కరీంనగర్ ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు కోసం కాంగ్రెస్ నుండి డమ్మీ అభ్యర్థిని నిలబెడుతున్నారు.. ఎవరెన్ని కుట్రలు చేసినా బండి సంజయ్ 4 లక్షల బంపర్ మెజారిటీతో గెలవడం తథ్యం?”అని పేర్కొన్నారు.

# ఎండ నుంచి విముక్తి

హైదరాబాద్, ఏప్రిల్ 19: తెలుగు రాష్ట్రాల్లో భానుడి ఉగ్రరూపంతో ప్రజలు అల్లాడుతున్నారు. ఇప్పటికే కొన్ని జిల్లాల్లో 40 డిగ్రీలు ఉష్ణోగ్రతలు దాటి నమోదు కాగా.. రాగల రెండు రోజులు 2 నుంచి 3 డిగ్రీల ఉష్ణోగ్రతలు అధికంగా నమోదయ్యే అవకాశం ఉందని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. శుక్ర, శనివారాల్లో కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో వడగాల్పులు వీస్తాయని అధికారులు తెలిపారు. ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. గురువారం ఖమ్మం జిల్లాలో 43 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4:30 వరకూ ప్రజలెవరూ బయటకు రావొద్దని హెచ్చరిస్తున్నారు. అటు, రాగల 3 రోజుల్లో కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. శనివారం ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడొచ్చని చెప్పారు. బుధవారం.. మన్నార్ గల్ఫ్ నుంచి దక్షిణ తెలంగాణ వరకు సగటు సముద్ర మట్టానికి 1.5 కిలో మీటర్ల ఎత్తులో కొనసాగిన ద్రోణి.. గురువారం కోమరిన్ ప్రాంతం నుంచి అంతర్గత తమిళనాడు, రాయలసీమ మీదుగా దక్షిణ తెలంగాణ వరకూ విస్తరించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీల ఎత్తులో కొనసాగుతోందని తాజాగా ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో 2015, 16 తర్వాత మళ్లీ అదే స్థాయిలో అధిక ఉష్ణోగ్రతలు ఈ ఏడాది నమోదవుతున్నట్లు అధికారులు తెలిపారు. అటు, ఏపీలోనూ కొన్ని జిల్లాల్లో 40 డిగ్రీలు దాటి ఉష్ణోగ్రతలు నమోదవుతూనే ఉన్నాయి. గురువారం 40కి పైగా మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 175 మండలాల్లో సాధారణ వడగాల్పులు వీచినట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అటు, రాబోయే 2 రోజులు కొన్ని జిల్లాల్లో తేలికపాటి, మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వెల్లడించారు. కోస్తా జిల్లాల్లో శనివారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు. అధిక ఉష్ణోగ్రతలు, వడగాల్పుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. వృద్ధులు, చిన్నారులు అత్యవసరమైతేనే బయటకు రావాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. బయటకు వస్తే వెంట వాటర్ బాటిల్, ఓఆర్ఎస్ అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు

# సీబీఐ మాజీ డైరక్టర్ ఆగ్రహం

హైదరాబాద్, ఏప్రిల్ 19: ఓ తెలుగు మీడియా సంస్థ తనపై తప్పుడు కథనాలు రాసిందని సీబీఐ మాజీ డైరక్టర్ నాగేశ్వరరావు సోషల్ మీడియాలో విమర్శలు గుప్పించారు. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ అనే సంస్థలో తాను భాగం అయ్యానని అనుకుని ఇలాంటి నిందలు వేస్తున్నారని విమర్శించారు. పదవీ విరమణ తర్వాత ప్రజావాహినిలో, జనస్రవంతిలో ఉండడం వలన మరియు కొన్ని ప్రజాహిత విషయాలపై స్పందించడం వలన చాలా మంది నన్ను వారి కార్యక్రమాలకు ఆహ్వానిస్తుంటారు. ఇవి తప్ప నాకు రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేదన్నారు. ఏప్రిల్ 16న కొంతమంది పరిచయస్తుల ఆహ్వానం మేరకు నేను హైదరాబాద్‌లోని యాఅఎ లో జరిగిన ఒక కార్యక్రమానికి హాజరయ్యాను. మాజీ భారత ప్రధాన ఎన్నికల కమిషన ఎ. రా. సంపత్ గారు ఈ కార్యక్రమంలో ప్రసంగిస్తారని తెలిసి వెళ్ళానన్నారు. పౌర సమాజం యొక్క పాత్ర ఆంధ్ర ప్రదేశ్ లో స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాత ఎన్నికలను నిర్వహించడానికి భారత ఎన్నికల కమిషన్ కు సహాయం చేయడానికి ఎంతో అవసరం అని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నేను పాల్గొనడం ఆంధ్రప్రదేశ్ లో అధికారంలో ఉన్న వైసీపీకి మరియు వారి ఆస్థాన సాక్షి మీడియాకి ఎందుకు కినుక కలిగించిందో విడ్డూరంగా ఉంది. తమ “ఎన్నికల నిర్వహణ” బట్టబయలు అవుతుందని భయపడుతున్నారా? ఏమోనని సెటైర్లు వేశారు.

తప్పుడు కథనాలను, అభూత కల్పనలను, కాల్పనిక సాహిత్యాన్ని నేను పట్టించుకోను. అయితే ప్రజలను తప్పుదోవ పట్టించాలనే వారి కుట్రను భగ్నం చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. అందుకొరకు నేను ఇక్కడ కొన్ని వాస్తవాలను ప్రజలకు తెలియజేస్తున్నానని సోషల్ మీడియా ప్రకటనలో తెలిపారు. పూర్తి ఆస్తుల వివరాలు ఎప్పటికప్పుడు ప్రతి సంవత్సరం ప్రభుత్వానికి నేను తెలియజేస్తూనే వచ్చాను. ఆ వివరాలు కేంద్ర హోం మంత్రిత్వ శాఖలో లభ్యమవుతాయి. అవి కాకుండా ఇంకా వేరే ఆస్తులు ఏమైనా నాకు ఉన్నట్లయితే వాటన్నింటినీ కథనాలు రాసిన పత్రికకు ఇచ్చేస్తానన్నారు. అవినీతి కూపంలో కూరుకుపోయిన వారికి, నిజాయితీ, చిత్తశుద్ధి కలిగిన వ్యక్తులు అతిపెద్ద శత్రువులు. ఎందుకంటే నిజాయితీపరుల ఉనికి వారి అవినీతిని ఎత్తిచూపుతుంది. కాబట్టి, వారు తమ అవినీతిని కప్పిపుచ్చుకునే వ్యర్థ ప్రయత్నంలో నిజాయితీపరులపై ఎప్పుడూ బురద చల్లుతుంటారు. వ్యభిచారులు సంసారులపై బురద జల్లటం అనాదిగా వస్తున్నదే .. గుమ్మడికాయ దొంగ ఎవరు అంటే భుజాలు తడుముకున్నట్టు సామెత ఉందన్నారు. రెండు రోజులుగా ఏపీ అధికార పార్టీకి చెందిన పత్రికలో సీబీఐ మాజీ డైరక్టర్ కు వ్యతిరేకంగా కథనాలు వస్తున్నాయి.

# తెలంగాణలో ఫుల్..ఫుల్ గా దావత్...

వరంగల్, ఏప్రిల్ 19: లోక్ సభ ఎన్నికలకు నాలుగు వారాలే మిగిలి ఉంది. సమయం లేదు మిత్రమా ఓటింగ్ సమయం దగ్గర పడుతోంది. దీంతో అప్రమత్తమైన రాజకీయ పార్టీల అభ్యర్థుల్లో టెన్షన్ నెలకొంది. ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో బిజీగా మారిపోయారు. ముఖ్యంగా గ్రేటర్ జిల్లాల పరిధిలోని మల్కాజ్ గిరి, సికింద్రాబాద్, చేవెళ్ల, హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల్లోని అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఒక వైపు పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ మరోవైపు వీలైనంత త్వరగా ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు యత్నిస్తున్నారు.

ఉదయం ఇతర పార్టీల కార్యకర్తలను పార్టీలోకి ఆహ్వానిస్తూ, వారికి కండువా కప్పడం. మధ్యాహ్నం బూత్, గ్రామ, మండల స్థాయి కమిటీలతో ఆత్మీయ సభలు, సమావేశాలు నిర్వహించి, ఎన్నికల్లో గెలుపు కోసం సమాలోచనలు చేయడం. సాయంత్రం ఏడు తర్వాత ముఖ్య అనుచరుల నివాసాలు, గెస్ట్ హౌసులు, ఆఫీసులు, హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్లు, ఫాం హౌసుల్లో గెట్ టు గెదర్ పార్టీలు ఏర్పాటు చేయడం నిత్యకృత్యమైంది. కాలనీ, అపార్ట్‌మెంట్, గేటెడ్ కమ్యూనిటీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, యువజన సంఘాలు, ఉద్యోగ, కార్మిక సంఘాల ప్రతినిధులను ఆహ్వానిస్తున్నారు. వివిధ రకాల మాంసాహార వంటకాలతో పాటు ఖరీదైన మద్యం బాటిళ్లను సరఫరా చేస్తున్నారు. ఒక వైపు అభ్యర్థి గెలుపునకు ఏ విధంగా కృషి చేయాలనే అంశంపై చర్చిస్తూనే మరో వైపు ‘సుక్క–ముక్క’తో ఓటర్లను తమ వైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఒకే చోట ఎక్కువ మంది కూడితే ఎన్నికల కమిషన్‌కు అనుమానం వస్తుందని భావించి, పోలింగ్ బూత్‌ల వారీగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పోలీసులకు ఏమాత్రం అనుమానం రాకుండా పుట్టిన రోజు వేడుకల బ్యానర్లను, కేకు, పుష్పగుచ్ఛాలను ఆ ప్రదేశంలో రెడీగా ఉంచుతున్నారు. ఎన్నికల్లో ప్రచారం కోసం బంధువులు, స్వగ్రామాలకు చెందిన వారిని కూడా నియోజకవర్గానికి రప్పించి, వారితో మంతనాలు జరుపుతున్నారు. స్థానికంగా స్థిరపడిన వారి బంధువుల ఓట్లు తమకే పడేలా ప్లాన్ చేస్తున్నారు. కనీసం ఏ ఒక్క రోజు కూడా పలకరించని నేతలు ఏకంగా ఇంటికి, గెస్ట్ హౌస్‌కు, హోటల్‌కు, క్యాంపు ఆఫీసుకు పిలిపించుకుని విజయం కోసం పాటు పడాల్సిందిగా వేడుకుంటున్నారు. బస్తీ లీడర్లు కూడా దీన్ని అవకాశంగా తీసుకుంటున్నారు. అభ్యర్థుల ముందు అనేక ప్రతిపాదనలను పెడుతున్నారు. సామాజిక వర్గం, హోదా, సంస్థాగతంగా ప్రజల్లో తనకు ఉన్న పలుకు బడికి ఓ రేటు నిర్ణయిస్తున్నారు. విధిలేని పరిస్థితుల్లో అభ్యర్థులు వారి డిమాండ్లను అంగీకరిస్తున్నారు. ముఖ్యంగా చేవెళ్ల, మల్కాజ్‌గిరి నియోజకవర్గాల్లోని ద్వితీయ శ్రేణి లీడర్లకు ఫుల్ డిమాండ్ ఏర్పడింది. ఎన్నికల్లో మద్యం పంపిణీని నియంత్రించేందుకు ఎన్నికల కమిషన్ గట్టి చర్యలే చేపట్టింది. గెట్ టు గెదర్ పార్టీలకు నేరుగా మద్యం సరఫరా చేస్తే పోలీసులు పట్టుకునే అవకాశం ఉండటంతో అభ్యర్థులు ఎవరికీ అనుమానం రాకుండా ముందే తమ అనుచరులు, బంధువులు, బినామీల పేరుతో ఉన్న వైన్స్‌లతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆ మేరకు ప్రత్యేకంగా టోకెన్లను కూడా ముద్రించి ఇస్తున్నారు. అభ్యర్థి వెంట రోజంతా తిరిగిన ముఖ్య అనుచరులతో పాటు ఇతర నిర్వాహకులకు సాయంత్రం వేళ టోకెన్లు జారీ చేస్తున్నారు. వీరు ఆయా వైన్ షాపుల వద్దకు వెళ్లి కావాల్సినంత మద్యాన్ని వెంట తీసుకెళ్తున్నారు. ఆత్మీయ సభలు, సమావేశాలకు హాజరయ్యే వారికి కూడా ఇదే విధంగా పంపిణీ చేస్తున్నారు.

ఎక్సైజ్ శాఖ జిల్లాలోని వైన్ షాపుల్లోని నిల్వలను ఏ రోజుకారోజు లెక్కిస్తున్నప్పటికీ వీరి లెక్కకు ఏమాత్రం కూడా చిక్కకుండా వ్యవహారం నడుస్తోంది. అంతేకాదు కాలనీ సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే సమావేశాలకు హాజరయిన సభ్యులను బట్టి బాటిళ్లను, బిర్యానీ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నారు.

# అభ్యర్థుల మార్పు

హైదరాబాద్, ఏప్రిల్ 19: తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల బరిలో ప్రధాన పార్టీలు అభ్యర్థులను ఖరారు చేసుకుని ప్రచార రంగంలో తలమునకలయ్యాయి. కానీ పలు స్థానాల్లోఅభ్యర్థుల మార్పుపై జోరుగా ప్రచారం సాగుతోంది. అందరికంటే ముందే క్యాండిడేట్స్‌ను ఖరారు చేసిన బీజేపీ కూడా కొన్ని స్థానాల్లో అభ్యర్థులపై పునరాలోచన చేస్తోందట. ఇంతకీ అంతలా అభ్యర్థిని మార్చే యోచన ఎందుకొచ్చింది..? ఏ స్థానాల్లో అభ్యర్థులు ఫిట్ అవడం లేదు..? డబుల్ డిజిట్ టార్గెట్‌తో ముందుకెళ్తోంది కమలదళం. సుదీర్ఘ కసరత్తు తర్వాత బలమైన అభ్యర్థులతో జాబితాలు విడుదల చేసింది. అయితే ఇందులో రెండు మూడు చోట్ల అభ్యర్థులను మార్చాలంటూ పార్టీలో డిమాండ్ వినిపిస్తోంది. ప్రకటించిన అభ్యర్థుల తీరుతో కూడా మార్పు అనివార్యమయ్యేలా ఉందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. పెద్దపల్లి క్యాండేట్‌పై పార్టీ హైకమాండ్ పునరాలోచనలో ఉన్నట్లు చెబుతున్నారు. అంతేకాదు ఖమ్మం, నల్గొండ లోక్ సభ అభ్యర్థులను కూడా మారుస్తారంటూ పార్టీలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రజాదరణ ఉన్నవారు, బలమైన నాయకులను ఎన్నికల బరిలోకి దించాలని ఈసారి వ్యూహాత్మకంగా వ్యవహరించింది కమలంపార్టీ. కొన్ని స్థానాల్లో వేరే పార్టీ నేతలను చేర్చుకుని మరీ పదిహేడు సీట్లకు అభ్యర్థులను ఖరారు చేసింది. పెద్దపల్లిలో కూడా కాస్త స్ట్రాంగ్ లీడర్ కావాలని కాంగ్రెస్ నుంచి గోమాస శ్రీనివాస్‌ని చేర్చుకుని టికెట్ ఇచ్చింది. ఆయన ఇప్పటిదాకా ఆయన పెద్దగా ప్రచారం చేసినట్లు కానీ, పార్టీ శ్రేణులను కలిసిన దాఖలాలు కానీ లేవు. టికెట్ ఇచ్చినా ఆయన గడపదాటటం లేదని స్థానిక నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెద్దపల్లి అభ్యర్థిని మార్చాలని డిమాండ్ చేస్తున్నారు. గతంలోనూ గోమాస ఇదే తరహాలో ఇతర పార్టీల్లో కూడా టికెట్ తెచ్చుకొని ఇంట్లో కూర్చునేవారని అక్కడి నేతలు అంటున్నారు. స్థానిక నేతలను కలుపుకుని పోవడం లేదని.. మోదీ హవా, పార్టీ సానుకూలతను వాడుకోవడం లేదని గోమాస శ్రీనివాస్‌పై ఇప్పటికే పార్టీ పెద్దలకు ఫిర్యాదులు అందాయి. దీంతో పెద్దపల్లి టికెట్ మార్చే అవకాశం ఉందని.. గతంలో టికెట్ ఆశించి భంగపడ్డ నేతలు మళ్లీ ప్రయత్నాలు ముమ్మరం చేశారట!

# వారసత్వ సంపదను భావితరాలకు అందించాల్సిన అవసరం ఉంది

## జీహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్

హైదరాబాద్, ఏప్రిల్ 19: వారసత్వ సంపదను భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ అన్నారు. ప్రపంచ హెరిటేజ్ దినోత్సవ సందర్భంగా జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో గురువారం దారుల్ షిఫా నుండి ప్రారంభమైన హెరిటేజ్ వాక్ సాలార్ జాంగ్ మ్యూజియం మీదుగా ఉస్మానియా ఆసుపత్రి వద్ద ముగిసింది.

హెరిటేజ్ వాక్ లో కమిషనర్ రోనాల్డ్ రోస్ తో పాటు జోనల్ కమిషనర్లు, హెచ్ ఓ డి లు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిహెచ్ఎంసి కమిషనర్ మాట్లాడుతూ... హైదరాబాద్ నగరంలో ప్రాముఖ్యత గల వారసత్వ సంపదను కాపాడేందుకు విశేష కృషి చేస్తున్నట్లు, వారసత్వ సంపదను బావితరాల వారికి అందించాలనే సంకల్పంతో చార్మినార్ పెడెస్ట్రెయిన్ ప్రాజెక్టు అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. జిహెచ్ఎంసి అధ్వర్యంలో 3 పురాతన భవనాలు పునర్నిర్మాణం, సుందరీకరణ కోసం రూ.18.33 కోట్ల వ్యయంతో మోజం జాహి మార్కెట్, మౌలాలి కామన్, క్లాక్ టవర్ పనులను పూర్తి చేయడం జరిగిందని, చార్మినార్ పెడేస్ట్రేయిన్ క్రింద చేపట్టిన వివిధ అసంపూర్తి పనులను పూర్తి చేసేందుకు చర్యలు



తీసుకుంటామన్నారు. చార్మినార్ చుట్టున్న ఆరు కమాన్ లను పున:నిర్మాణ, పునరుద్ధరణ పనులకోసం ప్రతిపాదించినట్లు కమిషనర్ పేర్కొన్నారు. ముర్గి చౌక్, సర్దార్ మహల్ పనులు కూడా చేపట్టి పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని అన్నారు.

హెరిటేజ్ వాక్ లో 1908 లో మూసి వరదల సందర్భంగా నగరంలో చేపట్టే అభివృద్ధి నీ స్ఫూర్తి గా తీసుకొని ఈ వాక్ ను నిర్వహించడం జరిగిందని ఈ వాక్ సందర్భంగా పాత మున్సిపల్ భవనాన్ని అదే విధంగా సాలార్ జంగ్ మ్యూజియం గతంలో ఏ విధంగా ఉండే ప్రస్తుత ఏ విధంగా ఉందో ఫోటో ల ద్వారా చూడడం జరిగిందని హెరిటేజ్ నగరంలో ఉన్న ప్రాముఖ్యత పై ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పున:నిర్మాణ, పునరుద్ధరణ చేపట్టే ఆరు కమాన్ లు రాణీ గంజ్ కమాన్, షేక్ ఫెయిజ్ కమాన్, చట్ట బజార్ కమాన్, దీవాన్ దేవడి కమాన్, దబీర్పూర కమాన్, హుస్సేన్ అలం కమాన్లు అభివృద్ధి చేయనున్నట్లు కమిషనర్ తెలిపారు.

ఈ వాక్ లో జోనల్ కమిషనర్లు రవి కిరణ్, స్నేహ శబరిష్, అభిలాష అభినవ్, పంకజ, వెంకన్న, అడిషనల్ కమిషనర్ కె. శ్రీవాత్సవ్, చంద్రకాంత్ రెడ్డి, చీఫ్ మెడికల్ ఆఫీసర్, చీఫ్ వెటర్నరీ ఆఫీసర్, చీఫ్ ఎంటమాలజి ఆఫీసర్ డాక్టర్ పద్మజ, డాక్టర్ అబ్దుల్ వాకిల్, డాక్టర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# బీఎస్పీ నుంచి బరిలోకి మందా



మహబూబ్ నగర్, ఏప్రిల్ 19: మందా జగన్నాథం.. నాగర్ కర్నూల్ పార్లమెంట్ సెగ్మెంట్‌లో పరిచయం అక్కరలేని పేరు. ఏకంగా నాలుగు సార్లు ఈ స్థానం నుంచి ఎంపీగా గెలిచి రికార్డు సృష్టించారు. పార్టీలు ఏవైనా గెలుపు తనదే అన్న రీతిలో నాడు రాజకీయాలు చేసేవాడు. కానీ రాజకీయ సమీకరణాలు మారిపోయాయి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత గులాబీ పార్టీ నుంచి పోటి చేసి ఓటమి పాలయ్యారు. అంతే పరిస్థితులు మొత్తం మారిపోయి. టికెట్ కోసం పార్టీలు మారినా కనీసం ఏ ఒక్క పార్టీ కనికరించలేదు. 1996లో తొలిసారి తెలుగుదేశం పార్టీ నుంచి నాగర్ కర్నూల్ ఎంపీగా మందా జగన్నాథం పార్లమెంటులో అడుగుపెట్టారు. అనంతరం 1999 నుంచి వరుసగా మూడు సార్లు విజయం సాధించి తిరుగులేని నేతగా ఎదిగారు. మొత్తం మూడు సార్లు టీడీపీ నుంచి గెలుపొందితే, 2009లో మాత్రం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా విజయం సాధించారు మందా జగన్నాథం. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత జరిగిన ఎంపీ ఎన్నికల్లో నాటి టీఆర్ఎస్ అభ్యర్థిగా మాత్రం మందా ఓడిపోవడం ఆయన పొలిటికల్ కెరీర్‌కు కోలుకోలేని దెబ్బ తగిలింది. ఇక, 2019లో మాత్రం మందా జగన్నాథంను కాదనీ పోతుగంటి రాములుకు గులాబీ బాస్ కేసీఆర్ టికెట్ కేటాయించారు. దీంతో ఆయన పోటీకి దూరంగా ఉన్నారు. అయితే మధ్యలో ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా కేసీఆర్ అవకాశం కల్పించినప్పటికీ, అసంతఈప్తిని మాత్రం వీడలేదు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో అలంపూర్ నుంచి కుమారుడికి లేదా తనకు టికెట్ కేటాయించాలని బీఆర్ఎస్ పార్టీ అధిష్టానాన్ని కోరారు. అయితే ఇద్దరికి కాకుండా విజేయుడుకు గులాబీ బాస్ బీ ఫామ్ ఇవ్వడంతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన అనంతరం ఎంపీ ఎన్నికల్లో నాగర్ కర్నూల్ టికెట్ ఆశించారు. పార్టీ అధిష్టానం మల్లు రవికి టికెట్ ప్రకటనతో ఆయన మరోమారు ఆలోచనలో పడిపోయారు. ఏది ఏమైనా ఈసారి ఎంపీ ఎన్నికల బరిలో నిలవాలని నిర్ణయించకున్నారు. బీఎస్పీ తరఫున ఎన్నికల క్షేత్రంలో నిలవాలని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఢిల్లీలో బీఎస్పీ అధినేత్రి మాయవతి అపాయింట్‌మెంట్ కోసం ఎదురుచూస్తున్నారు. ఎట్టిపరిస్థితుల్లో పార్టీ నుంచి టికెట్ తెచ్చుకుని తిరిగి సొంత నియోజకవర్గానికి వస్తారని ఆయన అనుచరులు చెబుతున్నారు. పార్టీలు టికెట్ ఇవ్వకపోయిన డెబ్బై ఏళ్ల వయసులో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు మందా జగన్నాథం. అయితే బీఎస్పీ తరఫున బరిలో దిగితే మాత్రం బీఆర్ఎస్ అభ్యర్థిగా కొనసాగుతున్న ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ కు నష్టం జరుగుతుందని నేతలు లెక్కలు వేసుకుంటున్నారు. మందా పోటీతో ఓట్లు చీలే అవకాశం ఉంటుందని అన్ని పార్టీల క్యాడర్ చర్చించుకుంటుంది. అలా జరిగితే ఎవరూ విజేతగా నిలుస్తారోనని టెన్షన్ కనిపిస్తోంది

# కీలక సమావేశానికి తలసాని డుమ్మా

హైదరాబాద్, ఏప్రిల్ 19: పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులకు బీఫాం ఇవ్వడంతో పాటు పార్టీ అనుసరించాల్సిన వ్యూహాన్ని ఖరారు చేసేందుకు తెలంగాణ భవన్‌లో మాజీ సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ కీలక నేతలు, ఎమ్మెల్యేలు, ఎంపీ అభ్యర్థులతో కేసీఆర్ సమావేశమయ్యారు.

కీలక భేటీకి మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, తలసాని కొడుకు తలసాని సాయికిరణ్ యాదవ్ గైర్హాజరు అయ్యారు. అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత తలసాని పార్టీ కార్యక్రమాలకు అంటి ముట్టనట్టుగా ఉంటున్నారని జోరుగా ప్రచారం జరుగుతోంది. ఇటీవల తెలంగాణ భవన్‌లో జరిగిన ప్రతి సమీక్షలో ఆయన మధ్యలోనే వెళ్లిపోయారు. దీంతో తలసాని వ్యవహారం పార్లమెంట్ ఎన్నికల గులాబీ పార్టీలో వేళ హాట్ టాపిక్‌గా మారింది. మరోవైపు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సీఎం రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. ఆయన హాజరు కాకపోవడం చర్చనీయాంశం అయింది. ఇవాళ సమావేశం ఉన్నట్లు తనకు తెలియదని.. అందుకే మీటింగ్‌కు హాజరు కాలేదని క్లారిటీ ఇచ్చారు. కొద్ది రోజుల కిందట తలసాని అయోధ్యలో రామ మందిరాన్ని దర్శించుకున్నట్లుగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. శ్రీరామ నవమి సందర్భంగా ఆయన సనత్ నగర్ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. కేసీఆర్ పుట్టిన రోజు వేడుకల్ని తలసాని శ్రీనివాస్ యాదవ్ ఘనంగా నిర్వహించారు. ఆ సమయంలో తన కుమారుడు సాయి కిరణ్ యాదవ్ కు సికింద్రాబాద్ ఎంపీ టిక్కెట్ కోరుకున్నారు.

కేసీఆర్ కూడా ఆయనకు ఇచ్చేందుకు సిద్ధమయ్యారని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. గత ఎన్నికల్లోనూ తలసాని కుమారుడు లోక్ సభకు పోటీ చేశారు. ఓడిపోయారు. ఈ సారి అసెంబ్లీ ఎన్నికల్లో సికింద్రాబాద్ పరిధిలో లక్ష కుపైగా ఓట్ల మెజార్టీ బీఆర్ఎస్ అభ్యర్థులకు రావడంతో సులువుగా గెలుస్తారని అనుకున్నారు. అయితే అనూహ్యంగా పోటీ చేయుడానికి సాయికిరణ్ యాదవ్ వెనుకడుగు వేశారు. తర్వాత కేసీఆర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ నే బరిలోకి దిగాలని కోరారు. కానీ తలసాని మాత్రం అంగీకరించలేదని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. చివరికి పార్టీ అభ్యర్థిగా సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావును ఖరారు చేశారు. ఆయన కోసం మొదట్లో కొన్ని రోజులు పని చేసిన ఆయన ఇప్పుడు పూర్తిగా సైలెంట్ అయిపోయారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం లేదు. కీలక సమావేశాలకూ హాజరు కావడం లేదు. ఆయన బీజేపీ అగ్రనేతలతో టచ్ లో ఉన్నారన్న ప్రచారం జరుగుతోంది. తలసాని గైర్హాజర్ ను.. బీఆర్ఎస్ నేతలు పెద్దగా పట్టించుకోలేదు.



# తెలంగాణ కాంగ్రెస్ లో మాదిగల పోరుబాట

హైదరాబాద్, ఏప్రిల్ 19: తెలంగాణ అధికార కాంగ్రెస్‌లో మాదిగల లొల్లి ముదురుతోంది. పార్లమెంటు ఎన్నికల వేళ ఆ పార్టీకి ఇది కొత్త తలనొప్పి తయారైంది. టికెట్ల కేటాయింపులో కాంగ్రెస్ పార్టీ మాదిగలకు అన్యాయం చేసిందని సొంత పార్టీ నేతలే గళమెత్తడం ఆ పార్టీ కల్లోలం రేపుతోంది. ఇప్పటికే ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ ఈ విషయంలో కాంగ్రెస్ తీరును ఎండగడుతున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీలోనే సీట్ల కేటాయింపుపై నిరసనకు సిద్ధమవుతుండం గమనార్హం. తెలంగాణలో ఎస్సీ సామాజిక వర్గంలో 70 శాతం మాదిగలే ఉన్నారు. ఇక ప్రస్తుతం పార్లమెంటు స్థానాల్లో 3 ఎస్సీలకు రిజర్వు చేయగా, మూడు స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ కనీసం ఒక్క మాదిగకు కూడా టికెట్ ఇవ్వలేదు. దీంతో తెలంగాణలోని మాదిగలతోపాటు కాంగ్రెస్ పార్టీలోని మాదిగ నేతలు కూడా అధిష్టానం తీరుపై రగిలిపోతున్నారు. లోక్‌సభ ఎన్నికల కోసం కాంగ్రెస్ ఇప్పటి వరకు 14 స్థానాలకు టికెట్లు ఖరారు చేసింది. ఇందులో నాగర్‌కర్నూల్, పెద్దపల్లి, వరంగల్ ఎస్సీ రిజర్వు నియోజర్గాలు. ఈ మూడు స్థానాల్లో మల్లు రవి(మాల), గడ్డం వంశీకృష్ణ(మాల), కడియం కావ్య(బైండ్ల)కు కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ కేటాయిచింది. మూడు స్థానాలను ఒకే సామాజికవర్గానికి కేటాయించడంపై మాదిగలు మండిపడుతున్నారు. పోరాటానికి సిద్ధమవుతున్నారు. ఇక తెలంగాణలోని మూడు ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గాల్లో బీజేపీ మాదిగలకు ప్రాధాన్యం ఇచ్చింది. రెండు స్థానాల్లో మాదిగలను, ఒక స్థానంలో మాల ఉప కులమైన నేతకాని వర్గానికి కేటాయించింది. నాగర్‌కర్నూల్ అభ్యర్థిగా మాదిగ సామాజిక వర్గానికి చెందిన పోతుగంటి భరత్‌ను ఎంపిక చేసింది. వరంగల్ సీటును కూడా మాదిగ సామాజికవర్గానికే చెందిన అరూరి రమేశ్‌కే కేటాయించింది. ఇక పెద్దపల్లి ఎంపీ అభ్యర్థిగా నేతకాని కులానికి చెందిన గోమాస శ్రీనివాస్‌ను ప్రకటించింది. ఇక తెలంగాణలో మొన్నటి వరకు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ కూడా లోక్‌సభ ఎన్నికల్లో మాదిగలకు ప్రాధాన్యం ఇచ్చింది. మూడు నియోజకవర్గాల్లో రెండు మాదిగలకు కేటాయించింది. ఒకటి మాల సామాజిక వర్గానికి ఇచ్చింది. వరంగల్ టికెట్‌ను మాదిగ వర్గానికి చెందిన డాక్టర్ మారేపల్లి సుధీర్‌కుమార్ పేరును ప్రకటించారు. నాగర్ కర్నూల్ అభ్యర్థిగా మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్‌ను ఖరారు చేశారు. ఇక పెద్దపల్లి టికెట్‌ను మాల సామాజికవర్గానికి చెందిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు బీఆర్ఎస్ ఖరారు చేసింది. మూడు ఎస్సీ రిజర్వుడు స్థానాలకు కాంగ్రెస్ పార్టీ రెండు సీట్లను మాలలకే కేటాయించింది. మూడో స్థానం మాదిగ ఉప కులమైన బైండ్ల సామాజికవర్గానికి చెందిన కడియం కావ్యకు కేటాయించారు. ఓట్ల శాతంలో అధికంగా ఉన్న మాదిగలకు టికెట్ కేటాయించకపోవడంపై కాంగ్రెస్ పార్టీలోని మాదిగ నేతలే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాల సామాజికవర్గానికి చెందిన వ్యక్తి కావడంతోనే మాదిగలకు అన్యాయం జరుగుతోందని ఆ పార్టీలోని మాదిగ నేతలు మండిపడుతున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ టికెట్ల కేటాయింపులో మాదిగలకు అన్యాయం చేయడంపై మాదిగ దండోరా, మాదిగ ప్రజాసంఘాల జేఏసీ, మాదిగ హక్కుల పోరాట సమితి, మాదిగ రాజకీయ పోరాట వేదిక సంఘాల ప్రతినిధులు పోరుబాట పట్టారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీకి చెందిన మోత్కుపల్లి నర్సింహులు మాదిగలకు జరిగిన అన్యాయంపై దీక్ష చేయాలని నిర్ణయించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ మాదిగలను అంటరానివారిగా చూస్తోందని ఆరోపించారు. ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన మాదిగ నేత మందా జగన్నాథం కాంగ్రెస్‌ను వీడారు. బీఎస్పీలో చేరి నాగర్‌కర్నూల్ టికెట్ కోసం ప్రయత్నిస్తు న్నారు. ఎస్సీ రిజర్వేషన్ నియోజకవర్గాల్లో మాదిగలకు టికెట్లు ఇవ్వకపోవడంపై మాదిగలు పోరుబాట పట్టడంతో దాని ప్రభావం ఆ మూడు నియోజక వర్గాలకే కాకుండా తెలంగాణలోని మిగతా 14 నియోజవర్గాల్లో ఉంటుందని విశ్లేషకులు, కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. ఇప్పటికే మంద కృష్ణ మాదిగ బీజేపీకి మద్దతు ప్రకటించారు. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ మాదిగలకు టికెట్ కేటాయించకపోవడంతో మాదిగల ఓట్లు బీజేపీకి పోలరైజ్ అవుతాయని అంచనా వేస్తున్నారు. అదే జరిగితే అన్ని నియోజకవర్గాల్లో గెలుపోటములు నిర్ణయించే స్థాయిలో మాదిగలు ఉన్నందున కాంగ్రెస్ పార్టీ ఇబ్బంది పడుతుందని పేర్కొంటున్నారు. మరి దీనిపై కాంగ్రెస్ అధిష్టానం మాదిగలకు ఎలా నచ్చజెబుతుందో చూడాలి.

# రోడ్డు పనులపై అలసత్వం

### – కాలనీవాసుల అందోళన

హైదరాబాద్: ఐ ఎస్ సదన్ డివిజన్ బాలాజీ నగర్ లోని నూతన రోడ్డు నిర్మాణ పనుల అస్తవ్యస్తం పై కాలనీవాసులు ఆందోళన దిగారు. బాలాజీ కాలనీలో రోడ్డు నిర్మాణ పనులలో భాగంగా తమ ఇంటి ముందు రాంపులను ఏకపక్షంగా రోడ్డు కాంట్రాక్టర్ అక్రమంగా కూల్చివేశారని వారు వాపోయారు. కాంట్రాక్టర్ రోడ్డుకు ఇరువైపులా సమానంగా కూల్చివేయకుండా కక్ష పూరితంగా ఒకవైపే మెట్లని రాంపులను కూల్చివేశారని బాలాజీ కాలనీవాసులు ఆందోళన దిగారు. కాంట్రాక్టర్ కొంతమంది కాలనీవాసులతో కుమ్మక్కై ఇష్టారాజ్యంగా వ్యవరించారని వారు ఆరోపించారు. ఈ సమస్య పై కార్పొరేటర్ దృష్టికి తీసుకు వెళ్లామని చెప్పారు .రెండు రోజులలో జిహెచ్ఎంసి కమిషనర్ . విజిలెన్స్ అధికారులకు కాంట్రాక్టర్ పై ఫిర్యాదు చేస్తామని కాలనీవాసి నరేందర్ యాదవ్ తెలియజేశారు. అయితే స్థానిక బిజెపి కార్పొరేటర్ కలుగజేసుకొని రేపటిలోగా మీ సమస్య పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో వారు విరమించారు. ఆందోళనలో పాల్గొన్న వారిలో కాలనీ అధ్యక్షుడు కరుణాకర్ రెడ్డి , నరేందర్యాదవ్ ..,దిలీప్ ,ప్రతాప్ ,బాబూలాల్ ,శేఖర్ రెడ్డి, సుందర్రావు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# దూరమౌతున్న కేడర్... నిలబెట్టుకొనేదలా...!

హైదరాబాద్, వరంగల్, ఏప్రిల్ 19: బీఆర్ఎస్ పార్టీకి పునర్ వైభవం తీసుకొస్తామని అధిష్టానం పదేపదే చెబుతున్నా ఆ దిశగా అడుగు ముందుకు పడటం లేదు. పార్టీకి గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పూర్తిస్థాయి కమిటీలు లేవు.. జిల్లా కేంద్రాల్లో పార్టీ కార్యాలయాలు నిర్మించినా కేడర్‌కు శిక్షణ కార్యక్రమాలు చేపట్ట లేదు. దీంతో పార్టీ కార్యాలయాలన్నీ నిరూపయోగంగానే మారాయని పార్టీ నేతలే ఆరోపిస్తున్నారు. కేసీఆర్ పదేళ్లు అధికారంలో ఉన్నప్పటికీ పార్టీ నిర్మాణంపై దృష్టిసారించలేదు. గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయలేదు. దీంతో అధికారం కోల్పోగానే గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నేతలంతా ఇతర పార్టీల్లోకి వలస వెళ్తున్నారు. దీంతో గ్రామస్థాయిలో పార్టీ ఖాళీ అవుతుంది. దీనిని నివారించేందుకు గ్రామస్థాయి నుంచి కమిటీలు, అనుబంధ కమిటీలు వేసి, శిక్షణ కార్యక్రమాలు చేపడితేనే పార్టీ బలోపేతంతో పాటు పునర్ నిర్మాణం జరిగి పార్టీ మనుగడ ఉంటుందని, లేకుంటే కష్టమేనని పార్టీ నేతలే అభిప్రాయపడుతున్నారు. అయితే పార్టీ అధినేత కేసీఆర్ పార్టీ పటిష్టతకు ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది సర్వత్రా ఆసక్తి నెలకొంది బీఆర్ఎస్ పార్టీని 2001లో స్థాపించారు. నాటి నుంచి 2014వరకు ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమాన్ని కొనసాగించింది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత అధికారంలోకి వచ్చింది. కానీ ఏనాడూ కూడా పార్టీ కేడర్ కు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయలేదని పార్టీ నేతలే పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇతర పార్టీల నుంచి వచ్చినవారు... పార్టీలో ఉన్నవారితో కలిసి గ్రామస్థాయిలో బలంగా ఉన్నామని చెప్పారు. రెండేళ్ల క్రితం పార్టీ సభ్యత్వాలు సైతం చేసి అత్యధిక సభ్యత్వాలు ఉన్నపార్టీ బీఆర్ఎస్ అని పార్టీ అధినేత కేసీఆర్ పేర్కొన్నారు. కానీ పార్టీ పటిష్టతపై మాత్రం దృష్టిసారించలేదు. గ్రామశాఖ అధ్యక్షుడిని మాత్రమే నియమించి పూర్తి స్థాయి కమిటీలతో పాటు అనుబంధ కమిటీలను సైతం నియమించలేదని పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ అన్ని గ్రామాల్లో కమిటీలు వేయాలని, సోషల్ మీడియా కమిటీని సైతం నియమించి యాక్టీవ్ గా పార్టీ కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీ ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఆదిశగా చర్యలు చేపట్టలేదని సమాచారం. అదే విధంగా మండల, నియోజకవర్గ కమిటీలు కూడా లేవు. అదే విధంగా జిల్లా కమిటీ అధ్యక్షులను మాత్రమే నియమించారు. పూర్తి జిల్లా కమిటీలతో పాటు అనుబంధసంఘాల కమిటీలు వేయలేదు. గతంలో వేసిన కమిటీలే ఇంకా కొనసాగుతున్నాయి. మరోవైపు గ్రామస్థాయి నుంచి పార్టీలో గ్రూపులు ఉన్నాయి. ఎమ్మెల్యేకు అనుకూలంగా, మొదటి నుంచి పనిచేస్తున్న వారు మరోవర్గంగా ఉన్నారు. ఎమ్మెల్యే అనుకూలవర్గానికే గ్రామకమిటీ అధ్యక్షుడిగా నియమించడంతో మిగతావారంతా గుర్రుగా ఉండటంతో కొన్ని కమిటీలను వేయలేదని సమాచారం. ఇదే పరిస్థితి నియోజకవర్గ, జిల్లా స్థాయిలో కొనసాగుతోంది. ఆ గ్రూపులే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమికి కారణమైందని పార్టీ నేతలు పేర్కొంటున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ నూతన రాష్ట్ర కమిటీ కూర్పుపై కసరత్తు ప్రారంభించినప్పటికీ ఎవరికైనా కమిటీలో అవకాశం రాకపోతే వ్యతిరేకత వస్తుందని భావించి వెనక్కి తగ్గినట్లు సమాచారం. ప్రస్తుతం రాష్ట్ర కమిటీలో 67 మంది సభ్యులతో జంబో కమిటీ ఉంది. ఆ కమిటీలో ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు కీలక సీనియర్ నేతలకు మాత్రమే అవకాశం కల్పించారు. పార్టీ అధ్యక్షుడు, కార్యనిర్వాహక అధ్యక్షుడితో సహా 20 మంది ప్రధాన కార్యదర్శులు, 33 మంది కార్యదర్శులు, 12 మంది సంయుక్త కార్యదర్శులున్నారు. ఆ కమిటీలో సెక్రటరీ జనరల్‌గా పనిచేసిన కేకే పార్టీ మారారు. సీనియర్ నేతలు మంద జగన్నాథం, కడియం శ్రీహరి, మధన్ రెడ్డి, పి.రాములు, బీబీపాటిల్, కూచుకుళ్ల దామోదర్ రెడ్డి ఇలా పలువురు రాష్ట్రకమిటీలో ఉండగా ప్రస్తుతం వారంతా పార్టీ మారారు. వీరి పోస్టులు ఖాళీ అయ్యాయి. నూతనంగా కమిటీని వేస్తే తమకు చోటుదక్కుతుందని పలువురు ఆశిస్తున్నారు. కానీ ఆదిశగా చర్యలు చేపడుతారో... లేదో చూడాలి. పార్టీ కేడర్‌ను ఎప్పటికప్పుడు యాక్టీవ్ చేసేందుకు పార్టీ అధిష్టానం అన్ని జిల్లా కేంద్రాల్లో పార్టీ కార్యాలయాలను నిర్మించింది. నియోజకవర్గాల వారీగా నేతలకు సమీక్షా సమావేశాలు నిర్వహిస్తామని పేర్కొంది. నిర్మించిన కార్యాలయాలు నిరూపయోగంగా మారాయి. శిక్షణ మాటలకే పరిమితం అయింది. పార్టీ కేడర్‌కు మార్గనిర్దేశం చేసే నాయకుడే కరువయ్యారని, పార్టీ ఏం చేపడుతుందో అర్థం కావడం లేదని, మనోధైర్యం నింపే పార్టీ నేత కరువయ్యారని పలువురు అభిప్రాయపడుతున్నారు. పార్లమెంట్ సన్నాహక సమావేశాలు కూడా పార్టీ కార్యాలయాల్లో కాకుండా ఫంక్షన్ హాళ్లలో నిర్వహిస్తుండటం శోచనీయం.

# ఈ సారి ఖమ్మం జిల్లా కమలానిదే

ఖమ్మం: నగరంలోని శ్రీ శ్రీ సర్కిల్ లో బీజేపీ ఎంపీ అభ్యర్థి క్యాంప్ కార్యాలయంలో తాండ్ర వినోద్ రావు మీడియా సమావేశం నిర్వహించారు. తాండ్ర వినోద్ రావు మాట్లాడుతూ వ్యాపారం నుంచి ప్రజా సేవ కోసం రాజకీయాల్లోకి వచ్చాను. గత 10 ఏళ్లలో మోడీ చేసిన అభివృద్ధి గురించి గ్రామాల్లో ప్రజలు చర్చించు కుంటున్నారు. 7 మండలాలు ఇప్పటికే పర్యటించాను. ఈ సారి నరేంద్ర మోడీ కి రామ రాజ్యం కోసం ఓటు వేస్తాం అంటున్నారు.. బీఆర్ఎస్ వల్ల గత 10 ఏళ్లలో ఏ ఒక్క అభివృద్ధి జరుగలేదు. మోడీ ఉంటేనే దేశం బాగుంటుందని ప్రజలు అంటున్నారు. కులమతాలకు అతీతంగా బీజేపీ కి ఓటు వేస్తామంటున్నారు.. ఖమ్మం ప్రజలు చాలా చైతన్య వంతమైన ప్రజలు ఈ సారి ఖమ్మం జిల్లా కమలానిదే. ఇకనుంచి అసెంబ్లీ స్థాయిలో విస్తృత ప్రచారం చేస్తాం. అయోధ్య రామ మందిర అక్షింతలు మోడీ ఇంటింటికి ఉచితంగా ఇచ్చారు. కానీ భద్రాచలం అక్షింతలు మాత్రం 150 రూ కొనాల్సిన పరిస్థితి. రేపు కేంద్రమంత్రి రాజ్ నాథ్ సింగ్, లక్ష్మణ్, వస్తున్నారు. 43 డిగ్రీల ఎండలో కూడా ప్రజలు నన్ను దీవిస్తున్నారు. దేశం కోసం,న్యాయం కోసం పోరాడుతున్నందుకు ప్రజలు మా వెంట వస్తున్నారని అన్నారు.

# రాజా రవీంద్ర ప్రధాన పాత్రలో రూపొందుతోన్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ‘సారంగదరియా’ టీజర్‌ను విడుదల చేసిన హీరో శ్రీవిష్ణు

రాజా రవీంద్ర ప్రధాన పాత్రలో సాయిజా క్రియేషన్స్ పతాకం పై చల్లపల్లి చలపతిరావు గారి దివ్య ఆశీస్సులతో ఉమాదేవి, శరత్ చంద్ర నిర్మాతలుగా పద్మారావు అబ్బిశెట్టి (అలియాస్ పండు) దర్శకుడిగా పరిచయం అవుతున్న చిత్రం ‘సారంగదరియా’. సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంటోంది. మే నెలలో సినిమాను విడుదల చేయటానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే లెజెండ్రీ సింగర్ పాడిన ‘అందుకోవా…’ అనే ఇన్‌స్పిరేషనల్ సాంగ్ తో పాటు ‘నా కన్నులే..’ అనే లిరికల్ సాంగ్స్ ను విడుదల చేయగా వాటికి చాలా మంచి రెస్పాన్స్ వచ్చాయి. గురువారం ఈ మూవీ టీజర్‌ను విడుదల చేశారు. యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో శ్రీవిష్ణు సినిమా టీజర్ ను విడుదల చేసి చిత్రయూనిట్ కి అభినందనలు తెలియజేశారు.

టీజర్‌ను గమనిస్తే.. ఇది పక్కా ఎమోషనల్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ అని తెలుస్తుంది. మధ్యవయస్కుడైన ఓ వ్యక్తి.. తన భార్య, ఇద్దరు కొడుకులు, కూతురితో సంసారాన్ని వెల్లదీస్తుంటాడు. సమాజంలో పరువుగా బతికితే చాలు అనుకునే వ్యక్తికి తన కొడుకులు, కూతురు వల్ల ఇబ్బందులు వస్తాయి. సమాజం అతన్ని నిలదీసే పరిస్థితులు ఎదురవుతాయి. అప్పుడు ఆ కన్నతండ్రి ఏం చేశాడు.. తన కుటుంబాన్ని ఎలా కాపాడుకున్నాడు.. అనే కథాంశంతో ‘సారంగదరియా’ చిత్రం రూపొందిందని టీజర్ ద్వారా స్పష్టమవుతుంది.

ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు ఉమాదేవి, శరత్ చంద్ర చల్లపల్లి మాట్లాడుతూ “మా ‘సారంగదరియా’ టీజర్‌ను విడుదల చేసిన హీరో శ్రీవిష్ణుగారికి ప్రత్యేక ధన్యవాదాలు. హృదయాన్ని హత్తుకునే భావోద్వేగాలుంటాయి. సినిమాను మే నెలలో విడుదల చేయాలనకుంటున్నాం. త్వరలోనే రిలీజ్ డేట్ అనౌన్స్ చేస్తాం” అన్నారు.

డైరెక్టర్ పద్మారావు అబ్బిశెట్టి(పండు )మాట్లాడుతూ “ మా మూవీ టీజర్ విడుదల చేసిన శ్రీవిష్ణుగారికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలను తెలియజేసుకుంటున్నాను. దర్శకుడిగా ఇది నా తొలి చిత్రం. ఒక మధ్యతరగతి ఫ్యామిలీ లో జరిగిన కొన్ని ఘర్షణల తో కథ ఉంటుంది. చక్కటి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. లవ్, ఫ్యామిలీ ఎమోషన్స్ ఇలా అన్ని ఎలిమెంట్స్ ఉంటాయి. మే నెలలో ప్రేక్షకుల ముందుకు రావటానికి ప్రయత్నాలు చేస్తున్నాం” అన్నారు.

నటీనటులు:

రాజా రవీంద్ర, శ్రీకాంత్ అయ్యంగార్,శివ చందు, యశస్విని,మొయిన్ ,మోహిత్,నీల ప్రియా, కదంబరి కిరణ్, మాణిక్ రెడ్డి, అనంతబాబు ,విజయమ్మ , హర్షవర్ధన్, తదితరులు

# ‘కృష్ణ ఫ్రమ్ బృందావనం’.. కొత్త సినిమా అనౌన్స్ చేసిన ఆది సాయికుమార్



టాలీవుడ్ యువకథానాయకుడు ఆది సాయికుమార్ కొత్త చిత్రం మొదలుపెట్టాడు. తనకు చుట్టాలబ్బాయి వంటి మంచి హిట్ సినిమాను అందించిన దర్శకుడు వీరభద్రమ్ చౌదరితో మరో సినిమా చేయబోతున్నాడు. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా రాబోతుండగా.. దిగంగనా సూర్యవంశీ కథనాయికగా నటిస్తుంది. లక్ష్మీ ప్రసన్న ప్రొడక్షన్స్ బ్యానర్ మీదా తూము నరసింహా, జామి శ్రీనివాసరావు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇక ఈ చిత్రానికి ‘కృష్ణ ఫ్రమ్ బృందావనం’ అనే టైటిల్‌ను ఫిక్స్ చేశారు. గురువారం పూజా కార్యక్రమాలతో గ్రాండ్‌గా లాంచ్ అయ్యింది ఈ ప్రాజెక్ట్.

ఇక ఈ వేడుకకు ప్రముఖ నిర్మాత దిల్ రాజు, దర్శకుడు అనిల్ రావిపూడి, విలక్షణ నటుడు, డైలాగ్ కింగ్ సాయి కుమార్ ముఖ్య అతిథులుగా విచ్చేసి సినిమా మంచి విజయం సాధించాలని కోరుకున్నారు. మురళీధర్ గౌడ్, 30 ఇయర్స్ పృధ్వీ, రఘు బాబు, అవినాష్, రచ్చ రవి, అశ్విని, శ్రీ దేవి, అలేఖ్య, స్నేహ, పద్మ, గిరిధర్, గోవర్ధన్, మాస్టర్ రిత్విక్, వెంకట్ నారాయణ, గురు రాజ్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రలు పోషిస్తుండగా.. రెగ్యులర్ షూటింగ్ జూన్ నుంచి ప్రారంభం కానున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. ఇక ఈ సినిమాకు అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్నాడు.

# ’మై డియర్ దొంగ లాంటి కాన్సెప్ట్ సినిమాలే చేస్తాం:

## కామ్(అంఓ) ఎంటర్ టైన్మెంట్ అధినేత మహేశ్వర్ రెడ్డి



సక్సెస్‌ఫుల్ చిత్రాలతో అలరిస్తున్న అభినవ్ గోమటం టైటిల్ పాత్రలో నటించిన చిత్రం ‘మై డియర్ దొంగ’. శాలినీ కొండెపూడి, దివ్య శ్రీపాద, నిఖిల్ గాజుల, వంశీధర్ గౌడ్, శశాంక్ మండూరి కీలక పాత్రలు పోషించారు. క్యామ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై గోజల మహేశ్వర్‌రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ప్రముఖ తెలుగు ఓటీటీ మాధ్యమం ‘ఆహా’లో విడుదల కాబోతోంది. ఈ చిత్రం ప్రమోషన్స్‌లో భాగంగా బుధవారం హైదరాబాద్ ప్రసాద్స్ ల్యాబ్‌లో ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టాలెంటెడ్ యాక్టర్ ప్రియదర్శి ముఖ్య అతిథిగా హాజరై ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో

మ్యూజిక్ డైరెక్టర్ అజయ్ అర్సాడా మాట్లాడుతూ..“అభినవ్‌తో స్టార్ చేస్తే.. 2014లో మేము తీసిన ఫస్ట్ మూవీ ‘జగన్నాటకం’లో కూడా అభినవ్ దొంగ క్యారెక్టర్ చేశాడు. మళ్లీ ఇప్పుడు పదేళ్ల తర్వాత దొంగ పాత్ర చేశాడు. ఇందులో కామెడీ చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. ర్యాడికల్ కామెడీ ఉంది. మ్యూజిక్ అంతా ఎంజాయ్ చేస్తూ చేశా. ఆహా గురించి చెప్పక్కర్లేదు. ఆహా నుంచి ఇంకా చాలా ప్రాజెక్ట్స్ వస్తాయని ఆశిస్తున్నా” అని అన్నారు.

నిర్మాత మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ..“మై డియర్ దొంగ అంటే ఈ టీమ్‌లో శాలిని. ఆమె ఒక స్టోరీ రాసి, అందులో నటించడం అంటే చాలా గొప్ప విషయం. ఆమె ఒక డైరెక్టర్‌ను సెలెక్ట్ చేసుకుని ఈ ప్రాజెక్ట్‌ను ఇంత సక్సెస్ చేయడంలో ఆమే కీలకం. తర్వాత ఆహా ఈ ప్రాజెక్ట్‌లో కీలకంగా వ్యవహరించింది. ఎంతోమంది కొత్త టాలెంట్‌ను గుర్తించి వాళ్లకు క్రియేటివ్ ఫ్రీడమ్‌ను ఇచ్చింది ఆహా. చాలా తక్కువ బడ్జెట్‌లో, తక్కువ టైమ్‌లో మంచి అవుట్‌పుట్ ఇచ్చిన డైరెక్టర్ సర్వాంగ రియల్లీ గ్రేట్. మ్యూజిక్ ఈ సినిమాకు గ్రేట్ ఎసెట్. శాలిని, అభినవ్ మధ్య వచ్చే సన్నివేశాలు బాగా పండాయి. క్యామ్(అంఓ) ఎంటర్‌టైన్‌మెంట్ అంటే ముగ్గురు వ్యక్తులు. వాళ్లు చంద్ర, అభిలాష్, మహేశ్. కొత్తవాళ్లతో మేము ఫ్రెండ్లీగా సినిమాలు చేయాలను కుంటున్నాము. మంచి స్టోరీస్ ఉన్నవాళ్లు మమ్మల్ని సంప్రదించండి” అని చెప్పారు.

నటుడు నిఖిల్ మాట్లాడుతూ..“ఇది నా ఫస్ట్ ప్రీరిలీజ్ ఈవెంట్. అభినవ్ అన్న నన్ను చాలా ఎంకరేజ్ చేశారు. సిద్ధు, అడివి శేష్ లాగా శాలినీ తనే కథ రాసి యాక్ట్ చేయడం నిజంగా గొప్ప విషయం. ఇందులో యాక్ట్ చేసిన వాళ్లలో ఒక్కరి నుంచి ఒక్కో విషయం నేర్చుకున్నా. నాలాంటి కొత్త నటుడి నమ్మినందుకు ఆహాకు థ్యాంక్స్. “ అని అన్నారు.

నటి స్నేహాల్ మాట్లాడుతూ..“డైరెక్టర్ కష్టం అంతా ట్రైలర్‌లో కనిపిస్తోంది. శాలినీ రైటింగ్ చాలా బాగుంది. దివ్య శ్రీపాదతో కలిసి నటించడం నా అదృష్టం. ఏప్రిల్ 19న ‘మై డియర్ దొంగ’ను ఆహాలో చూసి ఆనందించండి” అని చెప్పారు.

నటి దివ్య శ్రీపాద మాట్లాడుతూ..“నేను ఇందులో బుజ్జి అనే క్యారెక్టర్ చేశాను. నాకు శాలినీ చేసే స్కెచెస్ లాంటివి చాలా నచ్చుతాయి. ఇప్పుడు ఆమె రాసిన సినిమాలో నేను చేశా. ఇదొక నేచురల్ స్టోరీ. నేచురల్ స్టోరీ అంటే అందరూ విలేజ్ బ్యాక్‌డ్రాప్ అనుకుంటారు. కానీ ఇది సిటీలో జరిగే స్టోరీ. అమ్మాయి కష్టాలపై జోక్స్ వేసుకుని నవ్వించేలా ఈ సినిమా ఉంటుంది. ఇందులో నాక్యారెక్టర్ నా ఒరిజినాలిటీకి చాలా దగ్గరగా ఉంటుంది. టైమ్ తెలీకుండా సినిమా మొత్తం చూసేస్తారు. టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్” అని అన్నారు.

నటుడు శశాంక్ మాట్లాడుతూ.. “మా టీమ్ గురించి మాట్లాడాలంటే శాలినీ గురించి చెప్పాలి. ఫస్ట్ ఆడిషన్‌లోనే నన్ను సెలెక్ట్ చేసింది. కొన్ని ఇబ్బందులు వచ్చినా అధిగమించి సినిమాను పూర్తి చేసింది. అభినవ్ అన్న నుంచి చాలా నేర్చుకున్నా. టీమ్ అంతా ఎంతో ఎనర్జిటిక్‌గా పని చేశాం. ఈ సినిమాను 19న ఆహాలో అందరూ తప్పకుండా చూడండి.” అని అన్నారు. హీరోయిన్, రైటర్ శాలినీ మాట్లాడుతూ..“ముందుగా ఆహాకు థ్యాంక్స్ చెప్పాలి. నా స్క్రిప్ట్‌ను, నా యాక్టింగ్‌ను ఆహా టీమ్ ఎంతగానో నమ్మారు. నాకు ఫస్ట్ కాన్ఫిడెన్స్ ఇచ్చింది వాళ్లే. ఈ మధ్య చాలామంది యాక్టర్స్ రైటింగ్ కూడా చేస్తున్నారు. ఫస్ట్ నేను ఈ ఐడియా అనుకున్నప్పుడు వంశీని తీసుకున్నా. నేను ఏదైనా జోక్ చెప్తే వంశీ ఇంప్రువైజ్ చేశాడు. ట్రైలర్‌లో ఉన్న ఒక డైలాగ్‌ను కూడా వంశీ ఇంప్రూ చేశాడు. నేను, ప్రియదర్శి, అభినవ్ గోమటం ముగ్గురూ ఫ్రెండ్స్. ఫ్రెండ్స్‌కు థ్యాంక్స్ చెప్పకూడదని అంటారు. సినిమా రిలీజ్ అయ్యాక ఎలాంటి టాక్ వస్తుందో అని భయపడ్డా. కానీ ఇప్పుడే సక్సెస్ వైబ్స్ వస్తున్నాయి. ఫస్ట్ దీన్ని ఒక వెబ్ సిరీస్‌గా చేద్దామనుకున్నాం. కానీ ఇది ఫిల్మ్‌కు కూడా వర్కవుట్ అవుతుందని భావించి సినిమాగా చేశాం. మ్యూజిక్ డైరెక్టర్ బీజీఎంతో మేజిక్ క్రియేట్ చేశారు. టీమ్ అందరికీ గుడ్ లక్” అని చెప్పారు.

నటుడు వంశీ మాట్లాడుతూ..“ఈ ఐడియా స్టార్ట్ అయినప్పటి నుంచి శాలినీని చూస్తున్నా. ఫస్ట్ సినిమాకే శాలినీ స్క్రిప్ట్ వర్క్‌తో పాటు యాక్టింగ్ కూడా చేసింది. ఆమె జర్నీ రియల్లీ గ్రేట్” అని చెప్పారు.

ఆహా కంటెంట్ హెడ్ వాసు మాట్లాడుతూ..“ఏళ్ల తరబడి ఆహాను సపోర్ట్ చేస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్యూ. లాస్ట్ టైమ్ అర్థమైందా అరుణ్ కుమార్‌కు ప్రియదర్శి గెస్ట్‌గా వచ్చాడు. అది సక్సెస్ అయింది. ఇప్పుడు కూడా దర్శి గెస్ట్‌గా వచ్చాడు. ఈ సినిమా కూడా సక్సెస్ అవుతుంది. మై డియర్ దొంగ సినిమాకు శాలినీ గ్రేట్ ఎఫర్ట్ పెట్టింది. నిర్మాత మహేశ్ పని రాక్షసుడు. డైరెక్టర్ సర్వాంగ పని తీరు చాలా బాగుంది. ఇలాగే కష్టపడితే ఇంకా ఎన్నో మంచి సినిమాలు చేస్తాడు. ప్రతిఒక్కరూ ఈ ప్రాజెక్ట్‌ను సక్సెస్‌ఫుల్ ప్రాజెక్ట్‌గా ట్రీట్ చేస్తున్నారు. అభినవ్ క్రేజీనెస్ గురించి చెప్పాల్సిన పని లేదు. దొంగగా ఎవరు చేస్తే బాగుంటుందని శాలినీ, నేను అనుకున్నప్పుడు అభినవ్ పేరే వచ్చింది. ఈ సినిమా కోసం ఎంతోమంది తెరవెనుక గ్రేట్ వర్క్ చేశారు. వాళ్లందరికీ థ్యాంక్యూ. ఏప్రిల్ 19న మైడియర్ దొంగను ఆహాలో చూడండి” అని చెప్పారు. హీరో అభినవ్ గోమటం మాట్లాడుతూ..“ఈ సినిమా ఫస్ట్ కాపీ రెడీ అయినప్పటి నుంచీ దీనికోసం పని చేస్తున్నవాళ్లను నేను కలుస్తున్నా. ఆహా కంటెంట్ హెడ్ వాసు ప్రతి ఒక్కరికీ సపోర్ట్ చేస్తుంటాడు. ఆహా టీమ్ అందరికీ థ్యాంక్యూ. ఫస్ట్ పాజిటివ్ ఫీడ్ బ్యాక్ వాళ్లదగ్గర నుంచే వచ్చింది. ఈ కంటెంట్ మొత్తం నేను చూశాను. చాలా ఎగ్జైటింగ్‌గా ఉంది. శాలినీ, నేను పదేళ్ల నుంచి ఫ్రెండ్స్. ప్రియదర్శి నన్ను పెట్టి ఒక షార్ట్ ఫిల్మ్ డైరెక్ట్ చేశాడు. ఇప్పుడు శాలినీ స్క్రిప్ట్‌లో యాక్ట్ చేశా. ఆమె చాలా సెన్సిబుల్. ఆమె ఫస్ట్ ప్రాజెక్ట్ చాలా బాగా వచ్చింది. ఒక మంచి ప్రాజెక్ట్‌లో భాగమైనందుకు సంతోషంగా ఉంది. టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్.” అని చెప్పారు. చీఫ్ గెస్ట్ ప్రియదర్శి మాట్లాడుతూ..“శాలినీ, అభినవ్ నా ఫ్రెండ్స్. వాళ్లని సపోర్ట్ చేద్దామని నేను వచ్చాను. మేమంతా ఎక్కడో షార్ట్ ఫిల్మ్స్ చేసుకుంటే ఉండేవాళ్లం. ఇక్కడ సినిమా స్క్రీనింగ్ చేసుకోవడానికి కూడా డబ్బులు లేవు. కానీ ఇప్పుడు ఈ స్టేజీ మీద ఉండడం చాలా బాగుంది. యాక్టింగ్‌లో ఇంట్రెస్ట్ ఉన్నా అవకాశాలు రాకపోవడంతో తన స్క్రిప్ట్ తనే రాసుకుని మీ ముందుకు వస్తోంది శాలినీ. యుద్ధాన్ని వెతుక్కుంటూ ఆయుధాలు వస్తాయన్నట్లు శాలినీని వెతుక్కుంటూ ఆహా వచ్చింది. మిమ్మల్ని మీరు నమ్మితే అనుకున్నది సాధిస్తారు. అందుకు శాలినీయే ఉదాహరణ. ఈ సినిమా ఆమె కోసం సక్సెస్ అవ్వాలి. మంచి సినిమాలకు ఆహా సపోర్ట్ చేయడం నిజంగా మంచి విషయం. టాలెంట్ ఉన్నవాళ్లకు ఆహా ఎప్పుడూ సపోర్ట్ చేస్తుంది. ఈ సినిమా టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్” అని చెప్పారు.

నటీనటులు: అభినవ్ గోమటం, శాలినీ కొండెపూడి, దివ్య శ్రీపాద, నిఖిల్ గాజుల, వంశీధర్ గౌడ్, శశాంక్ మండూరి, చంద్ర వెంపతీ తదితరులు

# జితేందర్ రెడ్డి నుండి మంగ్లీ కొత్త పాట “లచ్చిమక్క” లిరికల్ సాంగ్ విడుదల

ముదుగంటి క్రియేషన్స్ పై ముదుగంటి రవీందర్ రెడ్డి గారు నిర్మాతగా ఉయ్యాల జంపాల, మజ్ను సినిమాలతో దర్శకుడుగా గుర్తింపు తెచ్చుకున్న విరించి వర్మ దర్శకత్వంలో పేక మేడలు సినిమాతో నిర్మాతగా బాహుబలి, ఎవరికి చెప్పొద్దు వంటి సినిమాలతో నటుడిగా పేరు తెచ్చుకున్న రాకేష్ వర్రె లీడ్ రోల్ లో నటించిన సినిమా జితేందర్ రెడ్డి. 1980 కాలంలో జరిగిన వాస్తవిక సంఘటనలు ఆధారంగా పొలిటికల్ డ్రామాగా ఈ సినిమా తెరకెక్కుతోంది. వైశాలి రాజ్, రియా సుమన్, చత్రపతి శేఖర్, సుబ్బరాజు మరియు రవి ప్రకాష్ ఇతర ముఖ్య పాత్రలో నటించారు.

గతంలో ఈ సినిమాకి సంబంధించిన టైటిల్ ఫస్ట్ లుక్ పోస్టర్ మరియు గ్లింప్స్ సినిమా పైన అంచనాలను పెంచేసాయి. రీసెంట్ గానే విడుదల అయిన అ ఆ ఇ ఈ ఉ ఊ సాంగ్ మంచి ప్రేక్షక ఆదరణ పొందింది, ముఖ్యంగా యువతకి ఆ పాట బాగా నచ్చింది. ఆ సాంగ్ కాలేజీ బ్యాక్ డ్రాప్ కాగా ఇప్పుడు విడుదలైన ఈ ‘లచ్చిమక్క’ సాంగ్ పెళ్లి బ్యాక్ డ్రాప్ లో ఉంది. ఈ పాటకి గోపి సుందర్ మ్యూజిక్ అందించగా రాంబాబు గోసాల లిరిక్స్ రాశారు మరియు మంగ్లీ ఈ పాటని చాలా బాగా పాడారు. జితేందర్ రెడ్డి ఇంట్లో జరిగే పెళ్ళిలో సరదాగా సాగే ఒక పాటలా ఉంది. 1980’ లో లొకేషన్స్ అన్ని కూడా చాలా నాట్యురల్ గా ఉన్నాయి. ఈ పాత ద్వార కథలో ట్విస్టులు ఉన్నట్టు అర్థమవుతుంది

ఈ సందర్భంగా ప్రొడ్యూసర్ ముదిగంటి రవీందర్ రెడ్డి గారు మాట్లాడుతూ: ఈ సినిమాకి సంబంధించి ఇప్పటి వరుకు రిలీజ్ అయిన గ్లింప్స్, టీజర్, సాంగ్స్ అన్ని కూడా మంచి ఆదరణ పొందాయి. ప్రేక్షకులు కొత్త నిర్మాతలమైనా మన్నలిని ఇంత బాగా ఆదరిస్తున్నారు. కంటెంట్ ఉంటె మన తెలుగు ప్రేక్షకులు ఎప్పుడు ఆ సినిమాని ఆదరిస్తారు అని మరో సారి నిరూపించారు.

ప్రస్తుతం వస్తున్న కథలకి పూర్తి భిన్నంగా ఉంది ఈ జితేందర్ రెడ్డి. ఈ సినిమా మే 3న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.

నటీ నటులు : రాకేష్ వర్రే, వైశాలి రాజ్, రియా సుమన్, ఛత్రపతి శేఖర్, సుబ్బరాజు, రవి ప్రకాష్

# మంచు విష్ణు ‘కన్నప్ప’లో స్టార్ నటి.?

మంచు విష్ణు హీరోగా వస్తున్న మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ ‘కన్నప్ప’ మోహన్ బాబు నిర్మాణంలో వస్తున్న ఈ చిత్రానికి మహాభారతం సీరియల్ ఫేమ్ ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న విషయం తెలిసిందే. అత్యంత భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రం రూపొందుతోంది. రీసెంట్‌గా మహాశివరాత్రి కానుకగా ఈ సినిమా నుంచి ఫస్ట్ లుక్ కూడా వదిలారు మేకర్స్. ఈ ఫస్ట్ లుక్‌లో విష్ణు జలపాతం నుంచి ఎంట్రీ ఇస్తూ.. బాణంను ఎక్కుపెట్టినట్లు కనిపిస్తున్నాడు. ప్రస్తుతం ఈ పోస్టర్ వైరల్ అవుతుండగా.. తాజాగా మూవీకి సంబంధించి ఒక సాలిడ్ అప్‌డేట్ బయటకు వచ్చింది.

ఈ సినిమాలో ఇప్పటికే మోహన్‌లాల్, మోహన్‌బాబు, ప్రభాస్‌తో పాటు బాలీవుడ్ స్టార్ నటుడు అక్షయ్ కుమార్ వంటి అగ్ర తారలు భాగమవుతున్న విషయం తెలిసిందే. తాజాగా మరో అగ్ర నటి ఈ సినిమాలో నటించబోతున్నట్లు తెలుస్తుంది. ఈ చిత్రంలో సౌత్ ఇండియా స్టార్ నటి కాజల్ అగర్వాల్ నటించనున్నట్లు సమాచారం. కాగా దీనిపై మేకర్స్ నుంచి ప్రకటన రావాల్సి ఉంది. ఇంతకుముందు విష్ణు, కాజల్ కలిసి మోసగాళ్లు అనే సినిమాలో నటించారు. ఇక కన్నప్ప విషయానికి వస్తే.. ఇటీవల న్యూజిలాండ్‌లో లాంగ్ షెడ్యూల్ పూర్తి చేసుకున్న చిత్ర బృందం ఇండియాకు తిరిగొచ్చింది. తాజా సమాచారం ప్రకారం మేలో మొదలయ్యే తాజా షెడ్యూల్‌లో ప్రభాస్ జాయిన్ కాబోతున్నట్లు తెలిసింది.

# దేవరను బీట్ చేసిన గేమ్ ఛేంజర్.. హిందీ బెల్ట్‌లో క్రేజ్ ఎలా ఉండబోతుందో..?

ఆర్‌ఆర్‌ఆర్ సినిమాతో గ్లోబల్ బాక్సాఫీస్‌ను షేక్ చేశారు టాలీవుడ్ స్టార్ హీరోలు రాంచరణ్, జూనియర్ ఎన్టీఆర్. ఈ ఇద్దరూ ప్రస్తుతం పాన్ ఇండియా ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారని తెలిసిందే.

రాంచరణ్ నటిస్తున్న చిత్రం గేమ్ ఛేంజర్. మరోవైపు ఎన్టీఆర్ నటిస్తోన్న ప్రాజెక్ట్ దేవర. ఈ సినిమాల థియాట్రికల్ రైట్స్‌కు సంబంధించిన వార్త ఒకటి ఇప్పుడు ఫిలింనగర్ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది.

అల్లు అర్జున్ పుష్ప 2 నార్తిండియన్ థియాట్రికల్ రైట్స్ విషయంలో ఆల్‌టైమ్ రికార్డును నమోదు చేసిందని తెలిసిందే. ఇక ప్రభాస్ నటిస్తోన్న కల్కి 2898 ఏడీ హిందీ హక్కులు కూడా భారీ మొత్తంలో రూ.100 కోట్లకు అమ్ముడుపోయాయి. ఇక ఇప్పుడు రాంచరణ్ టైటిల్ రోల్ పోషిస్తోన్న గేమ్ ఛేంజర్ వార్తల్లో నిలిచింది. హిందీ థియాట్రికల్ రైట్స్ లో జూనియర్ ఎన్టీఆర్ దేవరను బీట్ చేసిందన్న వార్త బీటౌన్‌లో హల్ చల్ చేస్తోంది.

తాజా టాక్ ప్రకారం గేమ్‌ఛేంజర్ హిందీ థియాట్రికల్ రైట్స్ ద్వారా రూ.75 కోట్లు రాబట్టడంతో.. ఈ ఫిగర్ దేవర రైట్స్‌ను (రూ.50 కోట్లు) ను దాటిపోయింది. కాగా ద్వారా నార్త్ ఇండియన్ ప్రేక్షకులలో సూపర్ క్రేజ్ సంపాదించిన రామ్ చరణ్, ఎన్టీఆర్.. మరి హిందీ బెల్ట్‌లో గేమ్ ఛేంజర్, దేవర సినిమాల విషయంలో ఎలాంటి పోటీ చూపిస్తారో చూడాలంటున్నారు సినీ జనాలు. పై నాలుగు సినిమాల హక్కులను పాపులర్ డిస్ట్రిబ్యూటర్, నిర్మాత అనిల్ తడని సొంతం చేసుకోవడం విశేషం.

శంకర్ దర్శకత్వంలో పొలిటికల్ థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కుతున్న గేమ్ ఛేంజర్ మూవీలో బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ ఫీమేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్న దేవరలో బాలీవుడ్ భామ జాన్వీకపూర్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది.



జాన్వీకపూర్‌కు ఇది టాలీవుడ్ డెబ్యూ ప్రాజెక్ట్ కావడం విశేషం.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI NO:- TELTEL 02048/2021, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**